2nd pages1.qxd 6/6/2025 7:49 PM Page 1


అభినందనలు అయినా..
సంతాపం అయినా...
వ్యాపార ప్రకటన అయినా...
విషయం ఏదైనా..
అతి తక్కువ ఖర్చుతో
ఎక్కువ మందికి చేరవేసే చక్కటి వేదిక
విశాఖ సమాచారమ్
దినపత్రిక
Contact :
9100986584, 95535 74250



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్


**మంచిమాటలు**
* జాలి పడి ఇచ్చే పలకరింపులకి, ప్రేమకి జోలె పట్టకు
* భారం అనుకునే చోట భావాలు పంచుకోకు..!
* దూరం నెట్టేసే చోట దగ్గరవ్వాలని ప్రయత్నించకు..!
* నిజాయితీని గుర్తించని చోట నిమిషం కూడా వృథా చేయకు..!
* ఆత్మాభిమానాన్ని మించిన ధనం ఈ ప్రపంచంలో మరొకటి వుంటుందని భ్రమపడకు..!
* ఎదురుచూడని ఇంటికి పిలిచినా వెళ్ళకు..!
* నీది కాని దేని మీదా నిన్ను తినేసేంత ప్రేమ, అభిమానం ఏదీ పెంచుకోకు


RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 213 విశాఖపట్నం, 7 జూన్ 2025 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


# విశాఖకు ఆ 'యోగ'ం వద్దు!



**ఈ నెల 21న లక్షలాది మందితో యోగా డే నిర్వహణపై అభ్యంతరాలు**

**కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో భారీ జన సమీకరణ అవసరమా?**

**మీ రికార్డుల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమా?**

**నియంత్రించాల్సిన ప్రభుత్వమే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం భావ్యమా?**

**ఇటీవలే లక్షలాది మందితో కడపలో టీడీపీ మహానాడు నిర్వహణ**

**యోగా డేను రద్దు చేయాలని కోరుతూ సీఎంకు ప్రజా ఆరోగ్య వేదిక లేఖ**

**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** కోవిడ్ కేసులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో భారీగా జన సమీకరణ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవలే ఏపీలోని కడపలో లక్షలాది మందితో టీడీపీ మహానాడు నిర్వహించడంపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు విశాఖలో ఈ నెల 21న లక్షలాది మందితో యోగా డే కార్యక్రమాన్ని తలపెట్టడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కోవిడ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విశాఖలో నిర్వహించే యోగా డేను రద్దు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజా ఆరోగ్య వేదిక తాజాగా లేఖ రాసింది. ఒకపక్క దేశంలో కోవిడ్ కేసుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇటీవల ఈ కేసులు మళ్లీ వెలుగు చూసిన మొదట్లో దేశవ్యాప్తంగా రోజుకు పదుల సంఖ్యలో నమోదయ్యేవి. క్రమంగా అవి వందలకు చేరుకునే పరిస్థితి తలెత్తుతోంది. దీంతో పాటు అక్కడక్కడ కోవిడ్ మరణాలూ సంభవిస్తుండడం ఇప్పుడు ఆందోళనకు గురి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈసారి వచ్చిన కరోనా ఏమంత ప్రమాదకరం కాదని చెబుతున్నప్పటికీ కోవిడ్ కేసుల సంఖ్య ఊపందుకోవడం, మరణాలు నమోదవుతుండడం వంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని చెబుతోంది. ఈ ఏడాది తాజాగా ప్రబలుతున్న కోవిడ్ – 19 కొత్త వేరియంట్ ఒమిక్రాన్‌ను పోలి ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ కొత్త వేరియంట్ ఇప్పటివరకు దేశంలో ఐదు వేల మందికి పైగా సోకినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇందులో మరణాలు 51 వరకు ఉన్నాయి. కోవిడ్ కేసులు నమోదవుతున్న రాష్ట్రాలను పరిశీలిస్తే అత్యధికంగా కేరళలో 1500 మంది, మహారాష్ట్ర, ఢిల్లీల్లో 500కి పైగా, పశ్చిమ బెంగాల్‌లో 350, గుజరాత్, కర్నాటకల్లో 300 చొప్పున రికార్డయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 50, తెలంగాణలో పశ్చిమ బెంగాల్‌లో 350, గుజరాత్, కర్నాటకల్లో 300 చొప్పున రికార్డయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 50, తెలంగాణలో ముగ్గురికి కోవిడ్ సోకినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి తొలి కోవిడ్ కేసు గత నెలలో విశాఖపట్నంలోనే నమోద్కెంది. ఆ తర్వాత కొద్ది రోజులకే తొలి కోవిడ్ మరణం (64 ఏళ్ల వ్యక్తి) కూడా విశాఖలోనే సంభవించింది. ఆ వ్యక్తి కోవిడ్‌తోనే మరణించాడని ...(మిగతా 2లో)





# చినాబ్‌పై చికుబుకు..

**ప్రపంచంలోనే ఎత్తైన వంతెనను ప్రారంభించిన మోదీ**

**కట్‌ఢా:** శతాబ్దపు కల నేటితో సాకారమైంది. ప్రపంచంలోనే ఎత్తయిన రైల్వే ఆర్చి బ్రిడ్జి అయిన చినాబ్ ఉక్కు వంతెనను ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. కట్‌ఢా నుంచి కశ్మీర్‌కు వందేభారత్ రైలుకు జెండా ఊపడం ద్వారా ఆ వంతెన అందుబాటులోకి వచ్చింది. అత్యంత దుర్లభమైన శివాలిక్, పీర్ పంజాల్ పర్వత శ్రేణులను కలుపుతూ కశ్మీర్ లోయకు రైలును నడపాలన్న బ్రిటీష్ కాలం నాటి ప్రణాళిక ఇప్పటికి కార్యరూపం దాల్చింది. అలాగే కట్‌ఢాలో రూ.46వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. కట్‌ఢా–శ్రీనగర్ మధ్య రైలుకు ఆయన జెండా ఊపారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ రైల్వే వంతెన (కేబుల్ బ్రిడ్జి)ను కూడా ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ప్రధాని జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఉధంపుర్‌లోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో దిగిన మోదీ.. వంతెన ప్రారంభానికి ముందు దానిని పరిశీలించారు. అలాగే జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా చినాబ్, అంజీ వంతెనలపై పరుగులు తీసిన వందేభారత్ రైలులో మోదీ ప్రయాణించారు. అనంతరం మోదీ కట్‌ఢాలో బహిరంగ ర్యాలీలో పాల్గొంటారు. ...(మిగతా 2లో)

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' అవార్డులు

**ఏపీ ప్రభుత్వం నిర్ణయం**




**అమరావతి, విశాఖ సమాచారం:** పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' అవార్డులు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు మండలాల వారీగా ఎంపిక చేసి షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ మార్గదర్శకాలు విడుదల చేశారు. విద్యా వ్యవస్థలో నాణ్యత, ప్రమాణాలు పెంచేందుకు ఈ అవార్డులు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. ఈ నెల 9న అన్ని జిల్లా కేంద్రాల్లో అవార్డులు ప్రదానం చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పదో తరగతిలో 500 (83.33 శాతం) పైన మార్కులు సాధించిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులను మండలాల వారీగా ఎంపిక చేసి అవార్డులు ఇవ్వనున్నారు. ప్రతి మండలంలో అత్యధిక మార్కులు సాధించిన మొత్తం ఆరుగురు పదో తరగతి విద్యార్థులకు ఈ అవార్డులు ఇస్తారు. వారిలో ఇద్దరు ఓసీ, ఇద్దరు బీసీ, 1 ఎస్సీ, 1 ఎస్టీ విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఇంటర్‌లో 830, ఆపైన అత్యధిక మార్కులు సాధించిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థులకు జిల్లాల వారీగా ఎంపిక చేసి అవార్డులు ఇవ్వనున్నారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ప్రతి జిల్లాకు 36 మంది ...(మిగతా 2లో)



## → 8 జిల్లాలతో ←
# 'విశాఖ ఎకనమిక్ రీజియన్'

**2032 నాటికి 120 బిలియన్ డాలర్ల ఎకానమీ**

**మూలపేట - కాకినాడ మధ్య బీచ్ రహదారి అభివృద్ధి**

**మరో ముంబ్కెలా విశాఖను తీర్చిదిద్దేలా ప్రణాళికలు**

**20 లక్షల మందికి 'వర్క్ ఫ్రమ్ హోమ్' కార్యాచరణ**

**వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలి**


**నీతి ఆయోగ్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి, విశాఖ సమాచారం :** 'విశాఖ ఎకనమిక్ రీజియన్'ను ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తీర్చిదిద్దాలని, 2032 నాటికి 120 బిలియన్ డాలర్ల సంపద సృష్టి ఈ రీజియన్ నుంచి జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. వచ్చే ఏడేళ్లలో విశాఖను మరో ముంబ్కె నగరంలా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, ఏఎస్ఆర్, మన్యం.. మొత్తం 8 జిల్లాల పరిధిలో ఎకనమిక్ యాక్టివిటీ పెరిగేలా ప్రాజెక్టులు నెలకొల్పాలన్నారు. 8 జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుల కోసం లక్ష ఎకరాలు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. 36 వేల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం, 15.5 మిలియన్ జనాభా కలిగివున్న విశాఖ రీజియన్‌లో ప్రస్తుతం 49 బిలియన్ డాలర్ల జీడీడీపీ నమోదవుతోందని... 2032 నాటికి 20 నుంచి 24 లక్షల మేర ఉద్యోగాలు పెరిగేందుకు అవకాశం ఉండటంతో ఈ ప్రాంతం రాష్ట్ర పురోగతిలో కీలకం కానుందన్నారు.

### 7 గ్రోత్ డ్రైవర్లు గుర్తింపు

శుక్రవారం సచివాలయంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో 'విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్'గా అభివృద్ధి చేసే అంశంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. 6 పోర్టులు, 7 మాన్యుఫాక్చరింగ్ నోడ్లు, 17 మేజర్ వ్యవసాయ క్షేత్రాలు, 6 సర్వీస్ హబ్స్, 12 పర్యాటక హబ్స్‌తో విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనిపై నీతి ఆయోగ్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోర్టు, ఐటీ, వ్యవసాయం, పర్యాటకం, హెల్త్ కేర్, పట్టణీకరణ, మౌలికవసతుల కల్పన... ఇలా 7 గ్రోత్ డ్రైవర్లుగా రూపొందించిన ప్రణాళికలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇందుకోసం అత్యంత ప్రాధాన్యమైన ...(మిగతా 2లో)


## ఆగస్టు 3న నీట్ పీజీ పరీక్ష నిర్వహణకు సుప్రీంకోర్టు అనుమతి



**ఢిల్లీ:** నీట్ పీజీ–25 ప్రవేశ పరీక్షను ఆగస్టు 3న నిర్వహించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డ్ ఈ కొత్త తేదీని ప్రతిపాదించగా.. అత్యున్నత న్యాయస్థానం ఓకే చెప్పింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల కోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ...(మిగతా 2లో)

## రైస్ మిల్లులపై మెరుపు దాడి

**భారీ ఎత్తున రేషన్ బియ్యం స్వాధీనం**



**ఆనందపురం, విశాఖ సమాచారం:** అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎఫ్ బియ్యాన్ని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. భీమునిపట్నం ఆర్డీవో సంగీత్ మాథుర్ ఆదేశాల మేరకు, ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామం లో గల శ్రీ సాయి రైస్ అండ్ ఫ్లోర్ మిల్, శ్రీ బాలాజీ మోడరన్ రైసు మిల్లుపై స్థానిక రెవిన్యూ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పెద్ద మొత్తంలో ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమం గా నిల్వవుంచి వాటిని మరలా పాలిషింగ్ చేసి బ్లాక్ మార్కెట్ లో తరలించినట్లు గుర్తించారు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం సీజ్ చేసి తగు చర్యల కోసం జాయింట్ కలెక్టర్‌కు నివేదిక పంపారు. ఈ సందర్భంగా ఆనందపురం మండల తహసీల్దార్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ బాలాజీ మోడరన్ రైస్ మిల్లు 50,800 కిలోలు, ...(మిగతా 2లో)





# జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం రసాభాస

**కమిషనర్‌ను నియమించకపోవడంపై నిలదీసిన వైసీపీ కార్పొరేటర్లు**

**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యతన శుక్రవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం రసాభాసగా ముగిసింది. జీవీఎంసీకి నూతన కమిషనర్ను నియమించాలంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనగా నల్ల కండువాలతో సభలోకి వైసీపీ కార్పొరేటర్లు ప్రవేశించారు. అయితే దీనికి ముందుగా పెహల్గం దాడిలో మృతి చెందిన విశాఖ వాసి చంద్రమౌళికి, తదనంతరం జరిగిన యుద్ధంలో మరణించిన మురళి నాయక్కు పెహల్గం దాడిలో మృతి చెందిన యాత్రికులకు, ఆపరేషన్ సింధూర్ మృతి చెందిన ...(మిగతా 2లో)

# ఒడిశా వైద్యం... ఉత్తమ ఫలితం

## హీట్ మసాజ్ థెరఫీతో ఎముకలు, కీళ్ల సంబంధిత వ్యాధులకు అద్భుత చికిత్స



**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** కీళ్ల నొప్పులు... కాళ్ల నొప్పులు.. అనగానే మనకు గుర్తుకు వచ్చేది కేరళ ఆయుర్వేద వైద్యం. అదే తరహాలో ఒడిశాకు చెందిన ప్రశస్తమైన ఆయుర్వేద అనువంశిక వైద్యం విశాఖ నగరంలో అందుబాటులో ఉంది. ఒడిశా రాష్ట్రంలోని కాపరాఘాట్లో కొన్ని తరాలుగా ఒక కుటుంబం ఎముకలకు సంబంధించిన వ్యాధులకు ఆయుర్వేద వైద్యం చేస్తోంది. బోన్ ఫ్రాక్చర్, కీళ్ల నొప్పులు, వాత నొప్పుల వంటి చికిత్సలో వారికి మంచి పేరు రావడంతో ఆ కుటుంబానికి చెందిన కవిరాజ్ రజనీకాంత్ శ్రీచందన్ అనే వైద్యుడు ఈ అద్భుత వైద్యాన్ని విశాఖ నగర, పరిసర ప్రాంత వాసులకు అందించాలనే సంకల్పంతో సుమారు 25 ఏళ్ల క్రితం విశాఖపట్నంలో వైద్యశాలను ప్రారంభించారు. ఎముకలకు సంబంధించిన మొండి వ్యాధులకు సైతం అతి తక్కువ ఫీజుతో చికిత్స అందజేసి వేలాది మందికి ఉపశమనం కలిగించారు. ఆయన రెండు సంవత్సరాల కిందట మృతి చెందడంతో ఆయన మేనల్లుడు రామచంద్ర పట్నాయక్ ఉరఫ్ దీపు ఆ వైద్య విధానాన్ని కొనసాగిస్తున్నారు. కీళ్ల నొప్పులు, వాత నొప్పులు, స్పాండిలోసిస, సయాటికా, బోన్ ఫ్రాక్చర్, వంటి బాధలకు ఇక్కడ మంచి చికిత్స అందిస్తున్నారు. వీరు ప్రధానంగా ఒడిశా ఆయుర్వేదిక్ హీట్ మసాజ్ థెరపీని ఫాలో అవుతున్నారు. శరీరంలో ఏ భాగంలో అయినా ఎముక విరిగినా ఆపరేషన్ లేకుండా ఆయుర్వేద మూలికలతో కట్టు కట్టి అతి తక్కువ సమయంలో, అతి తక్కువ వ్యయంతో చికిత్స అందిస్తుండడం వీరి మరో ప్రత్యేకత. విశాఖ పిఠాపురం కాలనీ విష్ణు హోండా పక్క రోడ్డులో పీతలవానిపాలెంలో వీరు జనసేవా ఎముకల ఆయుర్వేద వైద్యశాలను నిర్వహిస్తున్నారు. ఒడిశాలో ఇప్పటికీ వీరి వంశీయులు ఈ చికిత్సను కొనసాగిస్తున్నారు. విజయనగరంలో కూడా వీరి కుటుంబీకులే మరో బ్రాంచ్ నిర్వహిస్తున్నారు.

### సేవా భావమే ప్రధానం



మా పూర్వీకుల నుంచి వస్తున్న ఈ అనువంశిక ఆయుర్వేదిక వైద్యాన్ని మేము కొన సాగిస్తున్నాం. తర తరాల నుంచి సేవే ప్రధానంగా ఈ చికిత్సా విధానాన్ని కొనసాగిస్తున్నాం. అయితే ఈ చికిత్స విధానంలో వాడే ఆయిల్స్, వనమూలికల వంటివి ఎంతో ఖరీద్కెనవి కావడంతో కొంత ఫీజు తీసుకోవాల్సి వస్తోంది. ఎలాంటి ఎముక సంబంధిత వ్యాధులకైనా మేము గ్యారంటీ చికిత్స అందజేస్తున్నాము. ఆ నమ్మకంతోనే ఎందరో రోగులు నిత్యం మా వద్దకు వస్తున్నారు.

**- రామచంద్ర పట్నాయక్ (దీపు)**
**9642291955**

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ..

(మొదటి పేజీ తరువాయి)

చొప్పున ఎంపిక చేసి షైనింగ్ స్టార్ అవార్డులు ఇవ్వనున్నారు. అవార్డుకు ఎంపికైన పది, ఇంటర్ విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్‌తో పాటు రూ. 20వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందించి సన్మానించనున్నారు.

## చినాబ్‌పై చికుబుకు..


(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రదాడి నేపథ్యంలో భారీ స్థాయిలో భద్రతా బలగాలను మోహరించారు.

**చినాబ్ వంతెన ప్రత్యేకతలివీ..**

రైలు మార్గం ద్వారా కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపుర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే ప్రాజెక్టులో ఈ వంతెన భాగం. చినాబ్ నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో దీన్ని నిర్మించారు. దీని పొడవు 1,315 మీటర్లు. ఇప్పటివరకు చైనాలోని బెయిపాన్ నదిపై ఉన్న షుబాయ్ రైల్వే వంతెన (275 మీటర్లు ఎత్తు) పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువ కావడం విశేషం. అతివేగం, భూకంపాలు, వరదలు, బాంబు పేలుళ్లను సైతం తట్టుకునేలా అత్యాధునిక సాంకేతికతతో దీనిని నిర్మించారు. దీని ప్రారంభంతో జమ్మూ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. ఈ వంతెన జీవితకాలం దాదాపు 120 ఏళ్లు అని ఇంజినీర్లు చెప్తున్నారు. దీనిపై గరిష్ఠంగా 100కి.మీ. వేగంతో రైలు వెళ్లే అవకాశం ఉంది. 1.31 కి.మీ. మేర విస్తరించిన దీని నిర్మాణానికి కేంద్రం సుమారు రూ.1,486 కోట్లు ఖర్చు చేసింది. అలాగే 28వేల టన్నుల ఉక్కును వినియోగించినట్లు తెలుస్తోంది. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలో ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. అంటే ఇప్పుడు 23 ఏళ్ల తర్వాత ఇది పూర్తయింది.

## జమ్మూకశ్మీర్‌లో కొత్త యుగం ప్రారంభమైంది: చంద్రబాబు



**అమరావతి, విశాఖ సమాచారం:** ప్రధాని మోదీ నాయకత్వంలో జమ్మూ కశ్మీర్‌లో కొత్త పురోగతి యుగం ప్రారంభ మైందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సవాళ్లతో కూడిన భూభాగంలో రెండు కీలక ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసి దేశానికి అంకితం చేసిన మోదీని అభినందిస్తున్నట్లు చెప్పారు. చినాబ్ బ్రిడ్జ్.. ప్రపంచంలోనే ఎత్తయిన రైలు ఆర్చ్ వంతెన కాగా.. దేశంలోనే మొట్టమొదటిసారిగా తీగలతో అనుసంధానించిన అంజీ రైల్వే వంతెనను నిర్మించినట్లు వెల్లడించారు. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మెరుగుపరుస్తుందని, జీవనోపాధి అవకాశాలను సృష్టిస్తుందని అభిప్రాయపడ్డారు. వందేభారత్ రైళ్ల ద్వారా అన్ని వాతావరణ పరిస్థితుల్లో మాతా వైష్ణోదేవి కొలువైన కట్‌ఢా నుంచి శ్రీనగర్ వరకు రైలు కనెక్టివిటీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.



## జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం రసాభాస

(మొదటి పేజీ తరువాయి)

సైనికులకు జీవీఎంసీ కౌన్సిల్ సంతాపం తెలిపింది. ఐదు నెలల్కెనా జీవీఎంసీకి కమిషనర్ నియమింకపోవడంపై వైసీసీ కార్పొరేటర్లు నిలదీయడంతో గందరగోళం చోటుచేసుకుంది. కాగా, విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ వాసుల చిరకాల కల అయిన రైల్వే జోన్ సాకారమైందని.. ఇందులో భాగంగానే రైల్వే శాఖ జోన్‌కు జీఎంను నియమించినట్లు పేర్కొన్నారు. జీవీఎంసీ కమిషనర్‌ను త్వరగా నియమించేలా ముఖ్యమంత్రి చంద్రబాబును కోరుతామన్నారు. కూటమి ప్రభుత్వం మేయర్ పీఠాన్ని దక్కించుకున్న తర్వాత తొలి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, ఎంపీ గొల్ల బాబురావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## మొదటి రోజు ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

**అమరావతి, విశాఖసమాచారం:** ఏపీలో మెగా డీఎస్సీ పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం విడతలో 9 గంటల వరకు అభ్యర్థులను అనుమతించారు. 9.30 నుంచి 12 గంటల వరకు ఎగ్జామ్ నిర్వహించారు. ఈ నెల 30 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఏపీలో 137, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెగా డీఎస్సీలో 16,347 ఉపాధ్యాయ పోస్టులకు 3,36,305 మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులు సమర్పించారు. మధ్యాహ్నం విడతలో 2 గంటలకు అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. మరోవైపు డీఎస్సీ అభ్యర్థులందరికీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

## విశాఖకు ఆ 'యోగ'ం వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు ఆస్పత్రి వర్గాలు చెబుతుండగా, అధికార యంత్రాంగం మాత్రం కేజీహెచ్‌లో ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించనందున అది కోవిడ్ మరణంగా గుర్తించడం లేదని తేల్చేసింది. తాజాగా గురువారం విశాఖలో 14 ఏళ్ల బాలికకు కోవిడ్‌గా నిర్ధారణ అయింది. . ప్రస్తుతం వైజాగ్‌లో కరోనా సోకిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. కోవిడ్ కేసులు నమోదుతో విశాఖలో వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కోవిడ్ కేసు గత నెల 23న వెల వెలుగు చూసిన వెంటనే విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రి (కేజీహెచ్)లో 40 పడకలు, విమ్స్ (విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో 20 పడకలతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. కోవిడ్ అనుమానిత లక్షణాలున్న వారికి అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్‌యాంటిజన్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం 50 చొప్పున ర్యాపిడ్ కిట్లను అందుబాటులో ఉంచారు.

**టీటీడీలో అలా.. విశాఖలో ఇలా?**

రోజురోజుకూ కోవిడ్ వ్యాప్తి చెందుతున్న వార్తల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అప్రమత్తమైంది. తిరుపతి, తిరుమలకు వచ్చే భక్తులతో పాటు దేవస్థానం ఉద్యోగులు కూడా కోవిడ్‌పై ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తాజాగా విడుదల చేసిన అత్యవసర సర్క్యులర్ ద్వారా నిర్దేశించింది. కోవిడ్‌పై ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాలు, క్యూ కాంప్లెక్స్‌లు, వసతి సముదాయాలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో జన సమ్మర్ధతను తగ్గించాలని, ప్రార్థనా కార్యక్రమాలను నిలువరిచాలని సూచించింది. అలాగే వృద్ధులు, గర్భిణిల పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించింది. చేతులను తరచూ శుభ్రం చేసుకోవడం, మాస్కులు ధరించడం, మనుషుల మధ్య దూరాన్ని పాటించడం వంటివి అమలయ్యేలా చూడాలని స్పష్టం చేసింది. ఒకపక్క కోవిడ్‌పై టీటీడీ అప్రమత్తమవుతుంటే కరోనా కేసులు, మరణాలు నమోవుతున్న విశాఖపట్నంలో లక్షలాది మందితో ప్రధాని మోదీ సమక్షంలో యోగా డే కార్యక్రమాన్ని చేపట్టడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

**వైజాగ్‌లో యోగా డేను రద్దు చేయాలి**

దేశంలోనూ, రాష్ట్రంలోనూ, విశాఖలోనూ కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైజాగ్‌లో ఈనెల 21న తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను రద్దు చేయాలన్న డిమాండ్ ఊపందుకుంటోంది. ఈ యోగా దినోత్సవాన్ని ఐదు లక్షల మందితో నిర్వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులోకి ఎక్కించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉవ్విళ్లూరుతోంది. సర్వత్రా కోవిడ్ ఆందోళనకర పరిస్థితులు పరిస్థితులున్నప్పటికీ వైజాగ్‌లో లక్షలాది మందితో సామూహికంగా యోగా డేను కొనసాగించాలనే ప్రభుత్వ నిర్ణయం ఆందోళన కలిగిస్తోందని ప్రజా ఆరోగ్య వేదిక అభ్యంతరం వ్యక్తం చేసింది. 'కోవిడ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని విశాఖలో నిర్వహించ తలపెట్టిన యోగా డేను రద్దు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ప్రజా ఆరోగ్య వేదిక తాజాగా లేఖ రాసింది. లక్షలాది మంది మరణాలకు దారితీసిన కోవిడ్ - 19 రెండవ దశ నుంచి మనకు గతంలో చేదు అనుభవం ఉంది. అప్పటి సామూహిక సమావేశాలు కోవిడ్ విపత్కర వ్యాప్తికి దారితీశాయి. మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ముంచెత్తి అపారమైన బాధలను కలిగించాయి. ఈ ఆందోళనలకు తోడు ఆంధ్రప్రదేశ్ సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి ఇటీవల ఒక ప్రకటనలో కోవిడ్ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. కోవిడ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెద్ద సమావేశాలను నిలువరించాలని, రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాస్కులు తప్పనిసరి చేయాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో విశాఖలో లక్షలాది మందితో యోగా డే నిర్వహించడం, దానికి ప్రధాని మోదీ హాజరవుతుండడం విషాదం పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. ప్రజారోగ్య వనరులు సరిపోయినంతగా లేక ఆరోగ్య సిబ్బంది తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. వైద్య సిబ్బందిని ఈ కార్యక్రమానికి కేటాయించడం వల్ల కరోనా కేసులు పెరిగే అవకాశం ఉంది. కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే కోవిడ్ లక్షణాలతో ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపవద్దని సూచించింది. ఇది జాగ్రత్త అవసరాన్ని తెలియజేస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి మెగా యోగా డేను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. లక్షలాది మందితో కాకుండా వర్చువల్‌గా లేదా చిన్నతరహా యోగా కార్యక్రమాన్ని నిర్వాహించాలని కోరుతున్నాం' అని సీఎంకు పంపిన లేఖలో ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ రమణయ్య, టి.కామేశ్వరరావులు పేర్కొన్నారు.

## పారా స్పోర్ట్స్ క్రీడాకారులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

### - సీపీ శంఖబ్రత బాగ్చి



**విశాఖపట్నం, విశాఖ సమాచారం :** పారా స్పోర్ట్స్ క్రీడాకారులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని నగర పోలీస్ కమిషనర్ సీపీ శంఖబ్రత బాగ్చి ఆకాంక్షించారు. ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పారా స్పోర్ట్స్ చైతన్య యాత్రను ఆర్కే బీచ్ రోడ్ కాళీమాత ఆలయం వద్ద జెండా ఊపి సీపీ పారస్పోర్ట్స్ ప్రారంభించారు. ముందుగా 2 పోస్టర్ ఆవిష్కరించారు, యాత్రలో భాగంగా పారా స్పోర్ట్స్ ప్రతినిధులు, క్రీడా కారులతో కలిసి పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా స్పోర్ట్స్ ప్రతిభ కనబరిచిన వారికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో దివ్యాంగులకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఏ సమస్యైన సరే తన పర్సనల్ నెంబర్ కు ఫోన్ చేసి చెప్పవచ్చని సూచించారు. దివ్యాంగుల్లో ప్రతిభకనబరిచిన వారికి ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో పారా స్పోర్ట్స్లో ఉన్న క్రీడా కారులు మరింతగా ముందుకు సాగాలని కోరారు. పారా స్పోర్ట్స్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు సీతల్ మదన్ మాట్లాడుతూ స్పోర్ట్స్ రంగంలో పారా క్రీడాకారులకు అవకాశాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. పారా క్రీడాకారులకు విద్యార్హతను బట్టి ఎటువంటి అర్హత పరీక్ష లేకుండా మూడు శాతం ప్రభుత్వ ఉద్యోగాలు గ్రూప్ వన్, గ్రూప్ టూ, గ్రూప్ త్రీ, డీఎస్సీ, ఎక్సైజ్, ఫారెస్ట్, పబ్లిక్ సెక్టర్ అండర్ టేకింగ్ లోకల్ అర్హత ఆధారంగా ఇస్తున్నారని వివరించారు. యాత్ర అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పలువురు క్రీడాకారులకు పారా స్పోర్ట్స్ ప్రతినిధులను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆంధ్ర యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఎన్.విజయ మోహన్, మురళీకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, విజయనగరం గౌరవ అధ్యక్షుడు దయానంద, కోఆర్డినేటర్ శివగంగ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3న నీట్ పీజీ పరీక్ష నిర్వహణకు సుప్రీంకోర్టు అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ఎన్ఈబీ అభ్యర్థన మేరకు పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది. వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్టులలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడిరది. పోటీ తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కు ర్యాంకు నిర్ధరణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది. నీట్-పీజీ 2025ని రెండు షిఫ్టులలో నిర్వహిస్తారంటూ వెలువడిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినందున దేశమంతటికీ ఒకే షిఫ్టులో పరీక్ష నిర్వహించడం కష్టం కాబోదని చెబుతూ అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చింది. పరీక్ష నిర్వహణకు ఇంకా రెండు వారాలకు పైగా సమయం ఉన్నందున సురక్షితమైన పరీక్షా కేంద్రాల ఎంపిక కష్టమేమీ కాదని స్పష్టంచేసింది. ఏర్పాట్లకు సమయం సరిపోదని అధికారులు భావిస్తే పరీక్ష తేదీని పొడిగించుకొనే స్వేచ్ఛనిస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తేదీ మార్పు చోటుచేసుకుంది.

## రైస్ మిల్లులపై మెరుపు దాడి

(మొదటి పేజీ తరువాయి)

శ్రీ సాయి రైస్ అండ్ ఫ్లోర్ మిల్ లో 31, 668 కిలోల పీడీఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బియ్యాన్ని తరలించిన లైలాండ్ లారీ, ఒక ఆటో, మహేంద్ర బొలెరో లగేజ్ క్యారియర్ వ్యాన్ లను కూడా స్వాధీన పరచుకుని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా ఇప్పటికే పలుమార్లు పట్టుబడినప్పటికీ ఆ మిల్లులను శాశ్వతంగా సీజ్ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే చట్టపరమైన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## 8 జిల్లాలతో 'విశాఖ ఎకనమిక్ రీజియన్'

(మొదటి పేజీ తరువాయి)

41 ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉందన్నారు.

**సాకారమైతే ఫలితాలు ఇలా..**

విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలు అమలు చేయగలిగితే వచ్చే 7 ఏళ్లలో 7.5 లక్షల గృహాలు, 10,000 హోటల్ రూములు, 20 వరకు ఇన్నోవేషన్ సెంటర్లు, 10 కాలేజీలు, 7,000 ఆస్పత్రి బెడ్స్, 20,000 హెక్టార్ల పరిధిలో పరిశ్రమలు, 80 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయ సముదాయం, 60 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో గోదాములు అదనంగా సమకూరతాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. 'మూలపేట-విశాఖపట్నం, విశాఖపట్నం-కాకినాడ మధ్య బీచ్ రహదారులు నిర్మిస్తాం. వీటిని జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తాం. సముద్ర తీరం సంపద నిలయం దానిని మరింత వినియోగించుకునేలా చూడాలి. పర్యాటకాన్ని పరిశ్రమగా గుర్తించాం, నూతన పాలసీ పెట్టుబడిదారులకు ఎంతో అనుకూలం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా యువతకు నిరంతరాయంగా నైపుణ్య శిక్షణ అందిస్తాం. వర్క్ ఫ్రమ్ హోమ్ - నాలెడ్జ్ ఎకానమి అవుట్ సోర్సింగ్ విధానాలు అవలంభిస్తున్నాం. వర్క్ ఫ్రమ్ హోమ్ కింద 20 లక్షల మందికి అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**సమీక్షలో చర్చించిన మరికొన్ని అంశాలు**

దేశంలోని టాప్ 3 స్టీల్ పరిశ్రమలతో స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దడం. అలాగే పెట్రో కెమికల్స్, గ్యాస్ గ్రిడ్, పోర్టుల అభివృద్ధి, పెట్రోకెమికల్స్-మెడికల్ టెక్, షిప్ బిల్డింగ్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, క్లీన్ టెక్, లేబర్ ఇంటెన్సివ్ మాన్యుఫాక్చరింగ్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయం. వచ్చే 7 ఏళ్లలో ఐటీ రంగంలో కనీసం 4 నుంచి 5 లక్షల ఉద్యోగాల కల్పన జరిగేలా లక్ష్యం. డేటా సెంటర్లు, స్టార్టప్‌లు-ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటుకు ప్రాధాన్యత. ప్రస్తుతం కొనసాగుతున్న 4 రైల్వే ప్రాజెక్టులతో పాటు అదనంగా 2032 కల్లా మరో 7 కొత్త రైల్వే ప్రాజెక్టులు పూర్తిచేయడం. మాన్యుఫాక్చరింగ్ నోడ్స్, పోర్టులకు అనుకూలించేలా కొత్తగా 9 రోడ్డు ప్రాజెక్టులు చేపట్టడం. 2028-30 కల్లా 77 కి.మీ. మేర నిర్మించే వైజాగ్ మెట్రో ప్రాజెక్టుపై చర్చించారు.

**విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచేలా ప్రణాళికలు :**

- ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ట్రాన్సిషన్ రోడ్ మ్యాప్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - నీతి ఆయోగ్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ మధ్య ముఖ్యమంత్రి సమక్షంలో అవగాహనా ఒప్పందం కుదిరింది.
- ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 27.3 గిగావాట్లుగా ఉంది.
- రాష్ట్రంలో 2019లో 55.6 బిలియన్ యూనిట్లుగా ఉన్న విద్యుత్ డిమాండ్ 2025 నాటికి 69.7 బి.యూ.కు చేరింది. ఇందులో పరిశ్రమలో రంగంలో 4.8 శాతం, గృహ వినియోగానికి 5.1 శాతం మేర డిమాండ్ పెరిగింది.
- వచ్చే ఏడాదికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 88.6 బి.యూ నుంచి 2035 నాటికి 163.9 బి.యూ. కు చేరుకోనుంది.
- ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద 2029 నాటికి 78.50 గిగావాట్ల సోలార్ విద్యుత్, 35 గిగావాట్ల విండ్, పంప్డ్ స్టోరేజ్ 22 గిగావాట్లు, గ్రీన్ హైడ్రోజన్ 1.50ఎంఎంపీటీఏ, బ్యాటరీ స్టోరేజ్ 25 గిగావాట్లు, ఎథనాల్ 1,500 కెఎల్‌పీడీ, 5,000 ఈవీ చార్జింగ్ స్టేషన్లు, 10,000 టీపీడీ బయో సీఎన్జీ-సీబీజీ లక్ష్యం.
- క్లీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి ఇప్పటిదాకా రూ.5.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీంతో 57.7 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది.

ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం, సీఎస్ విజయానంద్, ఐఎస్ఈజీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2nd pages1.qxd 6/6/2025 7:49 PM Page 3



# గ్రామాల అభివృద్ధికి నిధులు



**గరుగుబిల్లి:** గ్రామాల అభివృద్ధికి కేంద్రం పలు పథకాలకు అవసరమైన నిధులు కేటాయిస్తోందని కేంద్ర బృందం డైరెక్టర్ తరుణ్ దోలియా తెలిపారు. చినగుడబ పంచాయతీలోని గదబవలసలో జలజీవన్‌మిషన్‌కు చెందిన తాగు నీటి పథకాల పనితీరును కేంద్ర బృందం డైరెక్టర్ తరుణ్ దోలియా, వాటర్ కమిషన్ డైరెక్టర్ నిఖిల్ జెప్, శాస్త్రవేత్త డి.అనంతరావులు పథకంలో ఏర్పాటు చేసిన కుళాయి లను పరిశీలించారు. ఈసందర్భంగా దోలియా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఏ మేరకు పథకాలు అమలు చేస్తున్నారన్న దానిపై పరిశీలిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ జలాలను అందించేందుకు జలజీవన్ మిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గ్రామంలో ఏర్పాటు చేసిన కుళాయిలను పరిశీలించి గ్రామ స్థుల నుంచి సమాచారాన్ని సేకరించారు. కార్య క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకర్, డీఈఈ నాగేశ్వర రావు, ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్ ఎం.దుర్గాప్రసాద్, జేఈ గౌరీశంకర రావుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ ఈకేవైసీ కోసం పాట్లు



**గూడెంకొత్తవీధి,:** మండలంలోని శివారు గ్రామాలకు సెల్ సిగ్నల్స్ అందక, రహదారి సౌకర్యం లేక ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. గురువారం నడవలేని స్థితిలో ఉన్న ఓ గిరిజనుడిని రేషన్ ఈకేవైసీ చేయించేందుకు స్థానికులు మంచంపై కొండపైకి తీసుకు వెళ్లాల్సి వచ్చింది.

మండలంలోని రింతాడ పంచాయతీ పరిధి గుర్రాళ్లగొంది గ్రామానికి చెందిన పాంగి సోమరాజు మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యాడు. నడవలేని స్థితిలో ఇంటి వద్దనే ఉంటున్నాడు. రేషన్ ఈకేవైసీ చేయించుకునేందుకు గడువు ముగుస్తున్నప్పటికి సోమరాజు ఈకేవైసీ చేయించుకోలేదు. దీంతో గురువారం ఉప సర్పంచ్, టీడీపీ నాయకుడు సోమేశ్ కుమార్, గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ చిన్నారావు సోమరాజుకు ఈకేవైసీ చేయించేందుకు గుర్రాళ్లగొంది వెళ్లారు. అయితే ఆ గ్రామంలో సెల్ సిగ్నల్స్ అందలేదు. గ్రామ శివారు కొండపై సెల్ సిగ్నల్స్ వస్తున్నాయని స్థానికులు చెప్పారు. దీంతో సోమరాజును స్థానికుల సహాయంతో సెల్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చే ప్రాంతానికి మంచంపై మోసుకు వెళ్లారు. ఈకేవైసీ చేయించి తిరిగి ఇంటికి చేర్చారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు సెల్ టవర్లు, రహదారుల సదుపాయం కల్పిస్తే ఆదివాసీలు ప్రభుత్వ పథకాలు పొందేందుకు అనువుగా వుంటుందని చెప్పారు.

# ఎస్సీ యువత నైపుణ్యానికి తగ్గట్టు ఉపాధి

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):–** రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలు ముఖ్యంగా మాలల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని మాలల సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ పెదపూడి విజయకుమార్ తెలిపారు. ఎస్సీ యువత నైపుణ్యానికి తగ్గట్టు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గురువారం ఎస్సీ కార్పొ రేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న ఉపాధి కల్పన పథకాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి వాటిని ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా రూపకల్పన చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల ఆర్థికాభివృద్ధికి ఈ ఏడాది రూ.340 కోట్ల బడ్జెట్ కేటాయించిదని, ఈ నిధులతో స్వయం ఉపాధి పథకాలను రూపొందిస్తామని తెలిపారు. ప్రతి ఇంట్లో ఒక ఎస్సీ యువతి, యువకుడును ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా రూపొందించడ మే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకు అవసరమైన నైపు ణ్య శిక్షణ, ఉన్న నైపుణ్యాలను మెరుగుపరిచే శిక్షణను ఎస్సీ యువతకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కలెక్టరు కార్యాలయం స మీపంలో ఉన్న బీఆర్ అంబేద్కర్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, దీన్ని బాగు చేయించే చర్యలు చేపడతామని చెప్పారు. ముందుగా కలెక్టరు అంబేద్కర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వివిధ పథకాలపై చర్చించారు. సమా వేశంలో ఎస్సీ మాల కార్పొరేషన్ డైరక్టరు మరిడయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# సీఎం, డిప్యూటీ సీఎంలకు గ్రీన్ క్లైమేట్ టీం అభినందనలు

గ్రీన్ క్లైమేట్ టీం ఉత్తమ కార్యక్రమాలు రాష్ట్రం అంతా కొనసాగిద్దామన్న సిఎం, డిప్యూటీ సీఎం లు. జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ



**అమరావతి, (విశాఖ సమాచారమ్):–** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లకు అభినందనలు తెలియజేస్తున్నామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం అన్నారు. శుక్రవారం విశాఖపట్నం లోని ఎంవిపి కాలనీలో ఆయన విలేకరులతొ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు జిల్లా తుల్లూరు మండలం అనంతవరంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలకు గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ కు ప్రత్యేక ఆహ్వానం పలికి సంస్థ కార్యక్రమాల ఎగ్జిబిషన్ నిర్వహించమని కోరడం ఆనందదాయకం అన్నారు.

ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ నిర్వహిస్తున్న పర్యావరణ కార్యక్రమాల ఎగ్జిబిషన్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ లు సంస్థ నిర్వహించిన ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఉత్తమ కార్యక్రమాలు రాష్ట్రం అంతా కొనసాగిస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. పర్యావరణ హితంగా జీవించడానికి సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రధానంగా పక్షులు గూళ్ళు పెట్టుకునే చెట్లు పక్షులు వన్యప్రాణులకు ఆహారం ఇచ్చే చెట్లు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, చెట్ల విత్తనాలతో తయారు చేసిన విత్తన బంతులు చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. విత్తన రాఖీలు పర్యావరణ హితంగా ఉన్నాయని దీనిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రమోట్ చేస్తామని, వృక్షా బందన్ కార్యక్రమం గురించి తెలుసుకుని రాష్ట్రంలో వందేళ్ల పై బడిన వృక్షాలను గుర్తించి వృక్షా బందన్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పి అక్కడికక్కడే అధికారులను ఆదేశించడం ఆనంద దాయకం అని అన్నారు. పిచ్చుకల గూళ్ళు పరిశీలించారని, ఇటీవల విశాఖపట్నం లో జివిఎంసి వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ ముప్పాళ శ్రీను ఇంటి వద్ద ఏర్పాటు చేసిన పిచ్చుకల గూళ్ళు, ధాన్యం కంకుల కుచ్చులు, అక్కడ కు చేరిన పిచ్చుకల వీడియో లు తన మొబైల్ లో తిలకించారని, శ్రీనివాస్ ను అభినందించారన్నారు. అన్ని పార్క్ ల లో ఇవి ఏర్పాటు చేద్దాం అన్నారని వివరించారు.

పర్యావరణ దినోత్సవ వేడుకల క్యాలెండర్ ను పరిశీలించి ఇది విద్యార్థులకు చాలా అవసరం అని పేర్కొన్నారని తెలిపారు. విత్తనాల ప్రదర్శన, విత్తన గ్రామాలు, మన కూరగాయల తోట కార్యక్రమాల చిత్రాలు తిలకించి ఇవి ప్రజలకు బాగా ఉపకరిస్తాయి అన్నారు. ధాన్యం కంకుల కుచ్చులు తయారీ విషయం లో పల్లెల్లో ని ప్రజలకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి ఆదాయం కల్పిస్తామన్నారు. పర్యావరణ, జీవావరణ దినోత్సవాలు, వన్యప్రాణులు దినోత్సవాలు నిర్వహించిన చిత్రాలు తిలకించి విద్యార్థులకు ఇవి బాగా ఉపకరిస్తాయి అని ఇరువురూ అభినందించారు న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం వివరించారు.

# నేడు వివిధ జోన్లలో తాగునీటికి అంతరాయం

## జీవీఎంసీ ఇన్చార్జ్ ప్రధాన ఇంజనీర్ కె.వి.ఎన్.రవి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్–3,5,8 పరిధిలలో జూన్ 7వ తేదీన తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ ఇన్చార్జ్ ప్రధాన ఇంజనీర్ కె. వి. ఎన్.రవి శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

జి.వి.యం.సి రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుండి టి.ఎస్.ఆర్ కు వచ్చు మంచి నీటి సరఫరా జరుగు ప్రధాన పి.డబ్ల్యు.డి పంపుహౌస్ నందు 11 కెవి/33 కెవి విద్యుత్ మరమ్మత్తులు జరుగు నిమిత్తం తేది. 07.06.2025 న (శనివారం) ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు మంచినీటి సరఫరా నిలిపివేయడమైనదని, ఆ సమయములో ఈ దిగువ తెలిపిన జోన్లలో గల ప్రాంతములకు మంచి నీటి సరఫరా కు అంతరాయము ఏర్పడుతుందని తెలిపారు.

జోన్–3 లో గల డాక్టర్స్ కాలనీ, ఎం.ఎం.టి.సి కాలనీ, ఎ.పి.ఎస్.ఇ.బి కాలనీ, అంబేద్కర్ నగర్, పి&టి. కాలనీ, గాంధీ నగర్ ఏరియా, రామకృష్ణా నగర్, శంకర్ మఠం మెయిన్ రోడ్డు, చాకలిపేట, లలితనగర్, చైతన్య నగర్, నక్కవానిపాలెం, క్రాంతి నగర్, ఎన్. హెచ్–16 రోడ్డు, కెపైన్ లైన్ ఏరియాస్, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, 80 అడుగుల రోడ్డు మొదలైన ప్రాంతాలు.

జోన్–5 లో గల లక్ష్మీ నారాయణపురం–1,2, లెపర్స్ కాలనీ, కస్తూరి నగర్–1, శాంతి నగర్–1,2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జై ప్రకాష్ నగర్, మహాత్మాగాంధీ నగర్, ఇందిరానగర్ 2 నుండి 5, బాపూజీ నగర్, పెద్దకొత్తూరు, అరుంధతి నగర్, రాంజీ ఎస్టేట్, మాధవధార, మాధవధార వుడా లేఅవుట్, మర్రిపాలెం, మర్రిపాలెం వుడా లేఅవుట్, ఎన్.జి.జి.ఓ'స్ కాలనీ,కంచరపాలెం, కరాసా, గ్రీన్ గార్డెన్స్ శివనగర్, జ్యోతినగర్, పార్వతి నగర్, శాంతి నగర్, తుమ్మడిపాలెం, హుస్సేన్ నగర్, ఆర్.పి.పేట మొదలైన ప్రాంతాలు.

జోన్–8 లో గల లక్ష్మినగర్– ఎఫ్ బ్లాక్ పార్కు, సి.డి.బ్లాక్ పార్కు, శ్రీనివాసనగర్, ఆర్.ఆర్.వి.పురం రజక కాలనీ మొదలైన ప్రాంతాలలో త్రాగునీటి సరఫరాకు అంతరాయము కలుగునన్నారు. కావున సదరు అంతరాయమునకు ప్రజలు సహకరించవలసినదిగా జీవీఎంసీ కమిషనర్ తరపున కోరడమైనదని జీవీఎంసీ ఇన్చార్జ్ ప్రధాన ఇంజనీర్ కె.వి.ఎన్.రవి తెలియజేశారు.

# క్షయ రహిత సమాజం దిశగా..

**నర్సీపట్నం:** క్షయ వ్యాధిని పారదోలడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నది. 'టీబీ ముక్తి భారత్' నినాదంతో ఈ వ్యాధి నుంచి ప్రజలను విముక్తి చేయడానికి వైద్య, ఆరోగ్య శాఖ పలు చర్యలు చేపట్టింది. వంద రోజుల్లో అన్ని ఇళ్లకు వెళ్లి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి వైద్య సిబ్బందిని రంగంలోకి దించారు.

క్షయ వ్యాధి ప్రమాదకరంగా మారింది. క్షయ వ్యాధిగ్రస్థులు దగ్గినప్పుడు వారి నోటి నుంచి వెలువడే తుంపర్ల కారణంగా ఇతరుకు వ్యాపిస్తుంది. ప్రస్తుతం జిల్లాలో 1,309 మంది క్షయ బాధితులు ఉన్నారు. నర్సీపట్నం, అనకాపల్లి, అచ్యుతాపురం, కోటవురట్ల, ఎలమంచిలి, నక్కపల్లి, చోడవరం, కేజేపురం, కె.కోటపాడుల్లోని ప్రభుత్వ టీబీ కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు. నర్సీపట్నం ఆర్టీపీసీఆర్ సెంటర్‌లో నెలకు 350 నుంచి 400 మందికి కఫం పరీక్షలు నిర్వహిస్తుంటే వీరిలో 20 నుంచి 25 మందికి పాజిటివ్ వస్తున్నది. క్షయ వ్యాధి నుంచి ప్రజలకు విముక్తి కలిగించడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నది. 'టీబీ ముక్తి భారత్' నినాదంతో క్షయ గురించి ప్రజలకు అవగాహన, ఉపసమనం కలిగించడానికి వైద్య, ఆరోగ్య శాఖ రంగంలోకి దిగింది. 'వంద రోజుల' లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను బుధవారం రంగంలోకి దించింది. ఈ బృందాలు ఇంటింటికీ వెళ్లి ఎక్కువ



రోజులు దగ్గుతో బాధపడుతున్న వారి నుంచి కఫం నమూనాలు సేకరిస్తున్నారు. మద్యం, ధూమపాన అలవాటు వున్నవారు, మధుమేహం, కిడ్నీ సంబంధ వ్యాధి, హెచ్ఐవీతో బాధపడుతున్న వ్యక్తులు, పోషకాహారం లోపతో బాధపడుతున్న వారు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, క్షయకు మందులు వాడి నయమైన వారు, వారి కుటుంబ సభ్యులకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి ఎక్స్‌రే, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారు. క్షయ నిర్ధారణ అయితే ఆరు నెలలకు సరిపడ మందును ఉచితంగా ఇస్తారు. అంతేకాక క్షయ పోషణ పథకం కింద ప్రతి నెలా రూ.1,000లను వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. క్షయ నివారణ మందులను క్రమం తప్పకుండా వాడేలా ఆశా వర్కర్లు వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తారు. జిల్లాలో ఉన్న 27 ఆర్టీపీసీఆర్ కేంద్రాలలో కఫం పరీక్షలు చేస్తున్నారు.



# వర్చువల్ విధానం ద్వారా లబ్ధిదారులకు మార్జిన్ సొమ్ము సబ్సిడీ పంపిణీ

**విజయవాడ, (పీఐబీ):–** ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం పథకం కింద వర్చువల్ విధానం ద్వారా దేశవ్యాప్తంగా 8794 మంది లబ్ధిదారులకు ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల శాఖ కమిషన్, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్తంగా 8794 మంది లబ్దిదారులకు 300 కోట్ల రూపాయలు మార్జిన్ సొమ్ము సబ్సిడీని పంపిణీ చేశాయి. ఈ చెల్లింపు ఇప్పటికే మంజూరు చేయబడిన 884 కోట్ల రూపాయల రుణం నుంచి చేయబడింది. ముంబయిలోని కెవిఐసి కేంద్ర కార్యాలయం, ఇర్లా రోడ్, వైల్ పర్లే (పశ్చిమం), ముంబయి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కెవిఐసి ఛైర్మన్ మనోజ్ కుమార్ వర్చువల్ విధానం ద్వారా ఈ మొత్తాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యమంలో కేంద్ర కార్యాలయానికి చెందిన సీనియర్ అధికారులతో సహా కెవిఐసి సీఈఓ రూప్ రాశి సైతం పాల్గొన్నారు.

పంపిణీ కార్యక్రమం సందర్భంగా, ఛైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ – "ప్రధానమంత్రి నరేంద్రమోదీ దార్శనిక నాయకత్వం మరియు మార్గదర్శకత్వం కింద స్వయం–ఉపాధికి పిఎంఇజిపి పథకంతో ఒక బలమైన పునాది ప్రస్తుతం నిర్మించబడింది. ఖాదీ మరియు గ్రామ పరిశ్రమలు అనేవి నేడు కేవలం ఒక ఉత్పత్తి మాత్రమే కావు.. అది ఆత్మనిర్భర్ భారత్ విజన్ యొక్క సారాంశం. ఈ పథకం లక్షల మంది యువతకు కేవలం ఉపాధి అందించడమే కాదు, వ్యాపారం యొక్క శక్తి ద్వారా వారందరినీ కనెక్ట్ కూడా చేసింది."

ఈ పంపిణీ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ఆరు జోన్లన్నీ యాక్టివ్‌గా పాల్గొన్నాయి. దక్షిణ జోన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలకు మొత్తంగా 2445 ప్రాజెక్టులకు రూ. 80.26 కోట్లు పంపిణీ అయ్యాయి. అలాగే కేంద్ర జోన్‌లో ఉత్తర్‌ప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ మరియు ఉత్తరాఖండ్‌లకు మొత్తంగా 2366 ప్రాజెక్టులకు రూ.91.13 కోట్ల రూపాయలు పంపిణీ అయ్యాయి. ఇక తూర్పు భారతదేశంలో బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, అండమాన్ నికోబార్‌బీ అలాగే ఈశాన్య భారతదేశంలో అస్సాం, మణిపూర్, మేఘాలయా, మిజోరాంలకు మొత్తంగా 2167 ప్రాజెక్టులకుగానూ రూ.62.68 కోట్ల రూపాయలు పంపిణీ అయ్యాయి. ఉత్తర ప్రాంతంలో హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ అండ్ కశ్మీర్, లడఖ్, పంజాబ్, రాజస్థాన్‌లకు మొత్తంగా 1320 ప్రాజెక్టులకుగానూ రూ.41.80 కోట్ల రూపాయలు పంపిణీ అయ్యాయి. అలాగే పశ్చిమ ప్రాంతంలో 496 ప్రాజెక్టులకుగానూ గుజరాత్, మహారాష్ట్ర మరియు గోవాలకు రూ.24.12 కోట్ల రూపాయలు పంపిణీ అయ్యాయి. ఈవిధంగా, దేశవ్యాప్తంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో కూడా స్వయం–ఉపాధిని పెంపొందించడానికి ఈ క్యాంపెయిన్ సమర్థవంతం మరియు ప్రభావవంతమైందని నిరూపితమైంది.

ప్రారంభమైనప్పటి నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం భారతదేశంలోని గ్రామ మరియు పట్టణ ప్రాంతాల్లో పరిశ్రమలు, స్వావలంబనకు పునాదిగా మారింది. ఇప్పటివరకు ఈ పథకం కింద 10,18,185 సూక్ష్మ పరిశ్రమలు నిర్మితమయ్యాయి, వీటి నిమిత్తం ప్రభుత్వం రూ.73,348.39 కోట్ల రూపాయలు రుణం మంజూరు చేసింది. ప్రతిగా, మార్జిన్ సొమ్ము సబ్సిడీ రూ. 27,166.07 కోట్ల రూపాయలు లబ్దిదారులకు అందించడం జరిగింది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 90,04,541 మంది ఈ పథకం కింద ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి పొందారు. దీని ద్వారా ఇది దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన స్వయం–ఉపాధి పథకం కింద మారిందని చెప్పచ్చు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):–** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

# నర్సీపట్నంలో యోగాంధ్ర- 2025




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** యోగాంధ్ర –2025 కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం పురపాలక సంఘము ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర అధ్యక్షతన శుక్రవారం ఉదయం స్థానిక శారదా నగర్ నలంద పాఠశాల ప్రాంగణములో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మరియు స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు, వారి కుటుంబ సభ్యులు మరియు బాల బాలికలతో కలిసి సుమారు 400 మందితో యోగా కార్యక్రమం యోగా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ యోగా ప్రదర్శనలో మహిళలు ఉత్సాహంగా ఉదయం 6 గంటలకు చేరుకొని యోగా సాధన క్రమశిక్షణతో నేర్చుకోవడం జరిగింది. యోగా గురువు రాయపురెడ్డి శ్రీనివాసరావు గారు, ఆయుష్ వైద్యులు యశోదా దేవి మరియు వారి సిబ్బంది యోగా సాధన చేయించడం జరిగింది.

యోగా ప్రదర్శనలో పురపాలిక సంఘం సిబ్బంది, వార్డు సచివాలయల సిబ్బంది, మహిళా ఉద్యోగులు, మెప్మా టౌన్ మేనేజర్ రమా దేవి, రిసోర్స్ పర్సన్సు లు తదితరులు పాల్గొన్నారు.

# గృహనిర్మాణ లబ్ధిదారులతో సమావేశం




**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):** తాళ్లపూడి మండలం ప్రజాపరిషత్ ఆఫీసులో స్పెషల్ ఆఫీసర్ డి ఎల్.పీ.వో అమ్మాజీ అధ్యక్షున గృహ నిర్మాణ లబ్ధిదారుల తో అవగాహన సదస్సు మరియు ఎలిజిబుల్ ఉన్న లబ్ధిదారులకు డ్వాక్రా మండల ఏపీఎమ్వా రితో మీటింగ్ నిర్వహించారు. మీటింగ్లో తాళ్లపూడి మండలం గృహ నిర్మాణ లబ్ధిదారులు 218 మంది వివిధ దశలలో ఉన్నారు వీరికి డ్వాక్రా రుణాలు ఇప్పించి గృహ నిర్మాణాలు వేగవంతం చేయడం కొరకు ఈ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.

# ఘనంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

**జలుమూరు:** దక్షిణ కాశీగా పేరుగాంచిన జలుమూరు మండలం శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రంలో శ్రీముఖలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు విశ్వనాథ ప్రసాద్ పాడి ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యావచనం, మండప ఆరాధన, స్వామి వారి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహిళ బ్యాగ్‌లో గొలుసు చోరీ

**శ్రీకాకుళం:** శ్రీకాకుళం నగరానికి చెందిన కోరాడ రామలక్ష్మి భర్తతో చిలకపాలెంలోని వివాహానికి వెళ్లి గురువారం ఆటోలో తిరుగు వస్తున్న సమయంలో శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోకి ప్రవేశించేసరికి ఆమె మెడలో గొలుసు తెగిపోయింది. ఆమె భర్త డ్రైవర్ పక్క సీటులో కూర్చోగా మరో ఇద్దరు గుర్తుతెలియని మహిళలు రామలక్ష్మి పక్క న కూర్చొన్నారు. ఆమె గొలుసు తెగిపోయిందని గమనించి ఆ ఇద్దరు మహిళలు బ్యాగ్‌లో వేసుకోవాలని సూచించారు. వారు అదే కాలనీ జంక్షన్‌కు వచ్చే సరికి ఆటో దిగిపోయారు. అనం తరం సదరు మహిళ లక్ష్మీటాకీస్ వద్దకు వచ్చేసరికి బ్యాగ్‌ను చూసుకునేసరికి బ్యాగ్ కత్తిరించి ఉండడంతో ఒక్కసారిగా అవాక్కయింది. గొలుసు చోరీ జరిగిందని గమ నించి వెంటనే రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజ్‌ల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

# యలమంచిలిలో యోగా నిర్వహణ

**యలమంచిలి:** యోగాంధ్ర 2025 లో భాగంగా యలమంచిలి మునిసిపల్ కమీషనర్ బి.జె.ఎస్పీ.రాజు అధ్యక్షతన రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఉదయం యోగా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడమైనది. యోగా గురువు గురువు శ్రీ మళ్ళ రాము పర్యవేక్షణలో ఆయుష్ డాక్టర్ శ్రీ.వినయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మరియు సిబ్బంది, సచివాలయ సిబ్బంది యోగాసనలు వెయ్యడం జరిగింది.

2nd pages1.qxd 6/6/2025 7:49 PM Page 4



విశాఖ సమాచారమ్

శనివారం 7-6-2025

## ఆర్థిక సంస్కరణలు అవసరం

*2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని 'వికసిత్ భారత్' పేరిట ప్రధాని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్థిక పరిమాణం విషయంలో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపడమే తమ లక్ష్యమని చెబుతున్నారు. ఇది జరగాలంటే వచ్చే 22 ఏళ్ల పాటు భారత జీడీపీ వృద్ధిరేటు కనీసం 7.8 శాతంగా నమోదవ్వాలని గత నెలలో ప్రపంచబ్యాంకు ఓ నివేదికలో వెల్లడిరచింది. అయితే, గడిచిన ఆర్థిక సంవత్సరం మన జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగానే నమోద్కెంది. 4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చెప్తున్న భారత్.. ఏటికేడాది 8.5 శాతం వృద్ధిరేటు నమోదు చేస్తే ప్రతీ సంవత్సరం 340 బిలియన్ డాలర్ల సొమ్ము ఆర్థికవ్యవస్థకు అదనంగా చేకూరుతుంది. ఇది పాకిస్థాన్ మొత్తం జీడీపీకి సమానం. ఇంతటి సొమ్ము ఏటికేడాది మన ఆర్థికవ్యవస్థకు అదనంగా జత కలిస్తేనే, రక్షణ దళానికి అవసరమైన ఆయుధాలు, మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేసుకోగలం. లక్షల మందిని పేదరికం నుంచి బయటపడేయగలం. అది జరుగని పక్షంలో అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దలేం. ప్రపంచంలో మనది ఇప్పుడు నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా కొందరు చెప్పుకొంటున్నారు. ఇదే సమయంలో దేశంలో ఒక్కో పౌరుడి తలసరి ఆదాయం ఎంత ఉన్నదో కూడా చూడాల్సి ఉంటుంది. దేశంలో జనాభా పెరుగుతూనే ఉంది. దీనికి అనుగుణంగా ఆర్థికవ్యవస్థ పరిమాణం పెరగాల్సి ఉంటుంది. త్వరలో మూడో స్థానంలో ఉన్న జర్మనీని కూడా మనం దాటేయగలమేమో గానీ, చైనాను కాదు. ఎందుకంటే ఆర్థిక పరిమాణంలో చైనాకు, మనకు ఎంతో అంతరం ఉంది.*

*మూడు విడతలు ఇలా..: మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిగా కంటే ఆర్థికమంత్రిగా ఎక్కువగా గుర్తిస్తారు. 90వ దశకంలో ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలే దీనికి కారణం. ఆయన ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు జీడీపీ వృద్ధిరేటు 1.25 శాతం నుంచి 7.5 శాతం వరకూ ఎగబాకింది. ఐదేండ్ల వ్యవధిలో విదేశీ మారక నిల్వలు నాలుగు రెట్లు పెరిగాయి. పేదరికం స్థాయిలూ తగ్గుముఖం పట్టాయి. ఇక, మోదీ మూడు పర్యాయాల పాలన విషయానికి వస్తే.. తొలి విడతలో హామీలతో నింపారు. మేకిన్ ఇండియా, జీఎస్టీ, ఎఫ్‌డీఐ, భూ సంస్కరణల పేరిట పలు వాగ్దానాలు ఇచ్చారు. భూ సంస్కరణల హామీ ఎప్పుడో అటకెక్కింది. ఇక, రెండో పర్యాయం అంతా.. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, సాగుచట్టాలు, కరోనా సంక్షోభంతో కొనసాగింది. మూడోసారి అధికారం చేపట్టి ఏడాది గడిచినప్పటికీ, గొప్ప నిర్ణయాలేమీ కనిపించట్లేదు. వ్యాపారం చేయడం ప్రభుత్వం పనికాదంటూ ప్రభుత్వరంగ సంస్థ ల్లో (పీఎస్‌యూ) పెట్టుబడుల ఉపసంహరణకు మోదీ ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. అయితే, లాభాల్లో ఉన్న సంస్థలను విక్రయించడంపై విమర్శలు వచ్చాయి. ఒక్క ఎయిర్ ఇండియా విక్రయమే సజావుగా సాగినట్టు చెప్తారు. ఇదే సమయంలో 'మేకిన్ ఇండియా' లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం చేరుకోలేకపోయింది. 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా జీడీపీలో తయారీరంగం వాటాను 25 శాతానికి తీసుకువెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ప్రస్తుతం జీడీపీలో తయారీ రంగం వాటా 13 శాతానికి పడిపోయింది. 1967 తర్వాత ఇదే కనిష్ఠం. ఇక, 2015లో తీసుకొచ్చిన 'స్కిల్ ఇండియా' పథకం కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. 2022 నాటికి దేశంలో 40 కోట్ల మంది యువతకు నైపుణ్యాన్ని మెరుగుపర్చాల్సి ఉండగా, 4 కోట్ల మందికి కూడా ఈ పథకం కింద శిక్షణను ఇవ్వలేకపోయారు. చైనా శ్రామిక శక్తిలో 60 శాతం మందిలో నైపుణ్యాలుంటే, భారత్‌లో ఇది 10 శాతానికి మించి ఉండదు. ఇలాంటి సమయంలో జీడీపీ వృద్ధిరేటు ఎలా పరుగు పెడుతుందన్నది ప్రధాన ప్రశ్న.*

*దేశంలో 45 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే, జీడీపీలో సాగురంగం వాటా 15 శాతంగానే ఉంది. ఇక, 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. తమను సంప్రదించకుండా తీసుకువచ్చిన ఈ నల్ల చట్టాలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని అన్నదాతలు తెగేసి చెప్పడంతో దిగివచ్చిన ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకుంది. ఒకవేళ, నిజంగా ప్రభుత్వం చెప్తున్నట్టు వ్యవసాయ దిగుబడిని పెంచి, రైతుల క్షేమం కోసమే ఈ చట్టాలను తీసుకొచ్చినట్టయితే, రైతులతో ముందే ఎందుకు సంప్రదింపులు చేపట్టలేదు? రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదు.*

*పాక్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా పార్టీలతో సంబంధం లేకుండా అన్నిపక్షాలూ ఏకతాటిమీదికి వచ్చాయి. ఇప్పు డు దేశార్థికాభివృద్ధికి ప్రధాని మోదీ అందరినీ ఏకతాటిమీదికి తీసుకురావాలి. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తామన్న ప్రధాని.. '2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్'ను మార్చడానికి కూడా అలాంటి రాజీలేని పోరాటమే చేయాలి. ఆర్థిక సంస్కరణలతో 10 శాతం వృద్ధిరేటు సాధిస్తేనే దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సైన్యానికి అవసరమైన డ్రోన్లు, ఆయుధాలను కొనగలం. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి. మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియాను రీలోడ్ చేయాలి. మూడు దశాబ్దాల నిర్విరామ కృషి ఫలితంగానే చైనా ఆర్థికాభివృద్ధి సాధించింది. భారత్ కూడా ఆర్థికరంగంలో ముందుకుసాగాలంటే ఇప్పుడు మోదీ ఆర్థిక సంస్కరణలకు పదునుపెట్టాలి.*

### పంచాంగం

శనివారం 7-6-2025
శ్రీ విశ్వావసు నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, గ్రీష్మ రుతువు
జ్యేష్ఠ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. ద్వాదశి పూర్తి |
| నక్షత్రం | : చిత్త ప. 9.40 |
| వర్జ్యం | : మ. 3.58 ల 5.46 |

# యవ్వనంగా ఉండాలంటే



"నాకు అది జరగాలి....ఇది జరగాలి..." అని మొక్కుకునే వారే ఈ ప్రపంచంలో ఎక్కువమంది. కానీ ఓ విషయం మాత్రం..

"ఇది నాకు జరగకూడదు..." అనే అందరం ఆశిస్తాం. అది ఏమిటీ...?

వయస్సు పెరుగుతున్న విషయం.

వయస్సే రాకూడదన్నది మనలో చాలా మంది ఆశ.

కానీ అది మన నియంత్రణలో లేదని తెలిసినా సరే వయస్సు పెరగకూడదని అనుకుంటూ ఉంటాం.

అయితే ఒక్కటి.

వయస్సు పెరిగినా యవ్వనంగా ఉండవచ్చు. అది మన చేతిలో ఉన్న విషయమే.

సరే...చాలా కాలం యవ్వనంగానూ, చురుగ్గానూ ఉండటానికి ఏమిటి దారి...

నిపుణులు ఇందుకోసం కొన్ని సూచనలు చేశారు.

మొదటి విషయం.

దేహం లావెక్కకుండా చూసుకోవాలి. దేహం స్లిమ్ముగా ఉంచుకుంటే ఉత్సాహంగా ఉండవచ్చుట. దేహం భారీగా ఉంటే మధుమేహం, హృదయ సంబంధ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయట.

సరే, లావెక్కిన దేహాన్ని తగ్గించుకోవడం ఎలా.

కొందరు ఇందుకోసం క్యాలరీలు తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు.

కొవ్వు తగ్గించుకోవాలి. అది ముఖ్యమైన విషయం. శారీరక వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలి.

బఠాణీ, పప్పుదినుసులు, ధాన్య రకాలు తినవచ్చు. విటమిన్ ఇ, సి, ఏ మూడు తప్పనిసరి. పసుపు రంగులో ఉన్న పండ్లను, కాయగూరలలో బీట్టా కరోటిన్ (విటమిన్ ఏ) ఉంది. మామిడిపండు, బొప్పాయి, ఆకుకూరలు ధారాళంగా తినవచ్చు.

దేహం, చర్మం, ఎముకలు బాగుండటానికి ప్రొటీన్లు అవసరం. కానీ అది అతిగా ఉండకడదు. ఎక్కువైతే మందంగా అనిపిస్తుంది. బరువుగా ఉన్నట్టు ఫీలవుతాం. వయస్సు మీద పడిన తర్వాత ఎక్కువగా ఎండవలో తిరగకూడదు.

తగినంత నిద్ర ఉండాలి. నిద్ర తగ్గితే డల్లుగా అనిపిస్తుంది.

ఈ ప్రపంచంలో వయస్సు వచ్చిన తర్వాత కూడా చాసా సౌఖ్యంగా సంతోషంగా ఉన్న వారిని పలువురిని పరీక్షించారట. వారందరూ ఉత్తినే ఉండటం లేద. ఏదో ఒక పని చేయడం. తోట పని చేయడం. ఇలా పనులు చేసే వారే ఎక్కువమంది. ఇలా ఉన్నవారిలో మెదడుకి రక్తప్రసరణ చక్కగా జరుగుతోందట. దీంతో వారు చురుగ్గా ఉంటున్నారు. మెదడు చక్కగా పని చేస్తోందట. అలాంటి వారు చాలా కాలం సౌఖ్యంగా ఉంటారట.

చాలా మంది డాక్టర్లు చెప్పేదేమిటంటే...

యూ విల్ స్టే యంగ్ ఇఫ్ యూ థింక్ యంగ్.

ఆలోచనలు యవ్వనంగా ఉంటే మీరు యవ్వనంగా ఉంటారు. కనిపిస్తారు.

నలభై ఏళ్ళు అవడంతోనే నా జీవితం అయిపోయిందని అనుకోకూడదు.

ఉద్యోగం నుంచి రిటైర్ అయి అరవై ఏళ్ళు పైబడ్డాక ఇక మీదటే నాకు జీవితం ఆరంభం అని చెప్పేవారూ ఉన్నారు.

ఎప్పుడూ యవ్వనంగా ఉండటాన్ని అలవాటు చేసుకోండి అంటుంటారు అందుకే.

అలా అనుకుంటే వయస్సు మీద పడుతోందనే ఆలోచనో రాదు.

ప్రాణాయామం మంచి వ్యాయామం. వీలైన మేరకు గాలిని లోపలికి పీల్చి విడవాలి.

ఒకరు తన 70వ వయస్సులో ఇలా చేస్తూ మరోవైపు పొగ తాగే అలవాటు ఉంటే దానిని విడిచిపెట్టారనుకోండి...వారి శ్వాసప్రక్రియ చక్కగా ఉంటుంది. నలభయ్యో ఏట ఎలా ఉందో అలాగే ఉంటుంది ఏడు పదుల వయస్సులోనూ. బద్ధకమనేది ఉండదు. నీరసం అనిపించదు. వయస్సు పైబడిన తర్వాత నీరసంగా ఉండటానికి ముఖ్య కారణం మన దేహంలో ఆక్సిజన్ తగ్గడమే. ఊపిరితిత్తులు చక్కగా ఉంటే ఈ లోటు రాదు. అందువల్ల వృద్ధాప్యాన్ని జయించాలంటే పౌష్టికాహారం, క్రమం తప్పని వ్యాయామం, మానసిక స్థితిని చక్కగా ఉంచుకోవడం ...ఈ మూడూ చాలా చాలా అవశ్యం.

అదొక సముద్రతీరం. అక్కడ ముగ్గురు తాతలు కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

తమ యవ్వన రహస్యం గురించి మాట్లాడుకున్నారు. ఆ ముగ్గురిలో యవ్వనంలో న్నట్టు కనిపంచిన వ్యక్తి చెప్పారు...

నేను చిన్న వయస్సు నుంచే సిగరెట్ తాగలేదని, అందులల్ల నేనిప్పుడు ఇలా మీ కన్నా యవ్వనంగా కనిపిస్తున్నానని.

అలాగైతే ఇప్పుడు మీ వయస్సు ఎంత అని అడిగారు...

80 నిండి 81 వచ్చిందన్నారాయన.

ఇంకొక తాత చెప్పారు ...

నేను చిన్న వయస్సు నుంచే సిగరెట్టే కాదు, మద్యం అలవాటు కూడా లేదు. అందుకే నేనిప్పుడు ఇలా ఉన్నాను అని.

అలాగైతే మీ వయస్సు ఎంత అని అడిగితే ఆయన 90 నిండి 91 వచ్చిందన్నారు.

చివరగా మూడో తాత చెప్పారు ...

నేను చిన్న వయస్సు నుంచే సిగరెట్ తాగేవాడిని. మద్యం సేవించే వాడిని. మాంసం తినేవాడిని...ఏదీ మానలేదు. అందువల్లే ఇప్పుడు నేనిలా ఉన్నాను అన్నారు.

మిగిలిన ఇద్దరూ తాతలు ఆయన వంక ఆశ్చర్యంగా చూస్తూ మీ వయస్సెంత అని అడిగారు.

ఆయన చాలా నెమ్మదైన స్వరంలో ఇప్పుడే 40 నిండి 41 ఆరంభమైందన్నారు.

**- యామిజాల జగదీశ్**

# ప్రయాణంలో మలుపు



సాయంకాలం చీకటి పడుతున్న వేళ, నేను పూణే నుండి హైదరాబాద్ ఒంటరిగా కారులో ప్రయాణిస్తున్నాను.అద్దె కారు, అలవాటైన దారి, ఇంటికి వెళుతున్న ఆనందంతో హుషారుగా ప్రయాణిస్తున్నాను.. కొంత సమయం తరువాత ఘాట్ రోడ్ మీద ప్రయాణం చేయాల్సి వచ్చింది. కారు కొంచెం నెమ్మదిగా వెళుతుంది.

కొంతసేపటికి ఘాట్ రోడ్ మీదకి చేరాను. నెమ్మదిగా కారు నడుపుతున్నాను. హఠాత్తుగా కారు ఆగిపోయింది. అప్పటికే సూర్యాస్తమయం కావొస్తోంది.

కారు అద్దెకి ఇచ్చిన వాళ్ళకు ఫోన్ చేసి విషయం ఏంటో, నేను ఎక్కడున్నానో చెప్పాను.

" సార్ ...అంత దూరంలో ఉన్న మీకు,ఈ సమయంలో మేము సహాయం చేయలేం. కావాలంటే కారు తాళాలు లోపల వదిలేసి లాక్ చేసి, మీరు వేరే వాహనంలో వెళ్లిపోండి. తర్వాత మా సిబ్బంది వచ్చి కారు తీసుకువెళతారు," అన్నారు.

ఇక ఏం చేయాలో తోచక, తాళాలు లోపలే వదిలేసి, కారు లాక్ చేసి, దారిలో లిఫ్ట్ కోసం చూడసాగాను. ఎవరూ ఆపడం లేదు. అప్పటికే చిన్న చినుకులు పడుతున్నాయి. చీకటి అలుముకోవడం మొదలైంది. చుట్టూ ఎవరూ కనిపించడం లేదు.

ఎన్నో వాహనాలు దాటుకుంటూ వెళుతున్నాయి, కానీ ఒక్కరూ ఆపడం లేదు. ఘాట్ రోడ్డు మీద వర్షంలో చీకటి పడుతుండటంతో నాలో ఆందోళన మొదలైంది. అయినా మొండిగా ముందుకు సాగుతున్నాను. ఇంతలో ఒక కారు మెల్లగా రావడం చూచాను. లిఫ్ట్ అని బొటన వేలు చూపించాను. మెల్లగా వెళుతుంది కానీ, ఆగడం లేదు. ఏదైతే అదే అయిందని, వెనుక డోరు పట్టుకున్నాను. అది తెరుచుకుంది. ఇంకేం ఆలోచించకుండా వెనుక సీటులో కూర్చున్నాను.

కూర్చున్న తర్వాత, వర్షంలో తడిసిన నా ముఖాన్ని తుడుచుకుని, కళ్ళద్దాలు సర్దుకుని, "థాంక్స్ సార్" అని అనబోతూనే... తుళ్ళిపడ్డాను!

నోట మాట రాలేదు%ొ% గుండె ఆగినంత పనైంది. .. ఎందుకంటే..... కారు వెనక సీట్లో నేను, తప్ప ఇంకెవ్వరూ లేరు. కారు మాత్రం వెళుతూనే వుంది.ఏదో కీడు శంకిస్తోంది నా మనసు.

దూరంగా నక్కల ఊళలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడూ తిత్తిరి పక్షి కూత వినిపిస్తోంది. హఠాత్తుగా గబ్బిలాల గుంపు వింతగా కూతలు కూస్తూ ఎగిరిపోయింది. ఆ క్షణం... చిన్నప్పుడు మా బామ్మ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి: "తిత్తిరి పక్షి కూత, గబ్బిలాల ప్రవర్తన అపశకునానికి సూచన".

నాకు చెమటలు పట్టడం మొదలయ్యాయి. వెన్నులో వణుకు ప్రారంభమైంది.

కారు ఒక చిన్న మలుపు వద్దకు చేరింది. నాకు ఆందోళన పెరిగిపోతోంది. ఈ ఘాట్ రోడ్డుపై ఏమైనా జరిగితే కారు లోయలో పడిపోతుంది. అంతే, ఇక నా సంగతి అయిపోతుంది.

ఆ ఆలోచనలో ఉండగానే, హఠాత్తుగా రెండు చేతులు మాత్రమే ప్రత్యక్షమై స్టీరింగ్ తిప్పి కారును రోడ్డుపై నేరుగా పోయేలా చేసాయి. అనంతరం ఆ చేతులు మాయమయ్యాయి!

"అమ్మయ్య, ప్రాణం పోయింది," అనుకున్నాను. కానీ... ఆ చేతులు ఎవరివి? మనిషి ఎక్కడా కనిపించడం లేదు! ఒకవేళ దెయ్యమేనా కారు నడుపుతోంది?! చిన్నప్పుడు బామ్మ చెప్పిన దెయ్యాల కథలన్నీ గుర్తుకొచ్చాయి. నాకు శరీరం వణికిపోసాగింది.

మరో మలుపు వద్ద మళ్లీ అదే జరిగింది. మళ్లీ ఆ చేతులు ప్రత్యక్షమై స్టీరింగ్ తిప్పి మాయమైపోయాయి.

నాకు వళ్లంతా చెమటలు పట్టాయి. బట్టలు తడిసిపోయాయి. నేను తీవ్రంగా ఆలోచిస్తున్నాను, ఈ దెయ్యం నుంచి తప్పించుకోవడం ఎలాగని.

కొంతదూరంలో ఒక దాబా కనిపించింది. దాబా దగ్గరకు రాగానే, ఇక ఆలోచించకుండా కారు డోరు తెరిచి దూకి, దాబాలోకి పరుగెత్తాను. అక్కడ కొంతమంది భోజనం చేస్తున్నారు. నాకు ధైర్యం వచ్చింది.

వాష్‌రూమ్‌కి వెళ్లి ఫ్రెష్ అయి, ఖాళీగా ఉన్న టేబుల్ వద్ద కూర్చున్నాను. నెమ్మదిగా గుండె దడ తగ్గుతోంది, చెమటలు కొంత ఆరాయి. తినడానికి ఏదో ఒకటి ఆర్డర్ చేద్దామని చూస్తున్నాను.

అంతలో ముగ్గురు వ్యక్తులు వచ్చి, ఖాళీలేక నా టేబుల్ వద్ద కూర్చున్నారు. వాళ్లతో మాటలు కలిపాను. నాకు జరిగిన దెయ్యం అనుభవాన్ని వాళ్లకు చెప్పాను.

వాళ్ల ముఖకవళికలు మారడం గమనించాను. ఇంతలో వాళ్లలో ఒకడు కోపంగా చూస్తూ, "ఒరేయ్... మన కార్ చెడిపోయి




వెనుకనుంచి నెట్టుకుంటూ వస్తుంటే, వీడు మన కార్లో కూర్చున్నాడుట!" అన్నాడు.

ఆ మాటలు వినగానే అక్కడినుంచి జంప్!

**- చప్ప గాంధీ**

# హోంసర్వీస్ ల్లో నకిలీలు



వృద్ధులకు సహాయకులను పంపే హోంసర్వీస్ ల్లో నకలీలు తయారవుతున్నారు. విజయవాడలో నకిలీ సహాయకులు తయారయ్యారు. ఏడ్వాన్స్ తీసుకుని ఉడాయిస్తున్నారు.ఇటీవల జరిగిన సంఘటన ద్వారా వెల్లడైంది. ఈ రకం మోసానికి పాల్పడిన సంఘటన వెలుగులోకి రావడంతో వృద్ధులు భయపడుతున్నారు. ఒంటరిగా జీవిస్తున్న వృద్ధదంపతులు తమ సహాయకులుగా ఉండడానికి మహిళలను హోంసర్వీస్ ద్వారా నియమించుకుంటారు. నెలకు 20 వేల రూపాయలు చెల్లిస్తారు.సహాయకులు వారికి అన్ని రకాల (నేచురల్ కాల్స్)అవసరాలకు సహాయపడతారు. 24 గంటలు వీరితోనే ఉంటారు. కేవలం హోంసర్వీస్ వారి హామీతో వీరిని ఇంట్లో ఉంచుకుంటారు.వారు నిజాయితీ పరులతో పర్వాలేదు. వారు నకిలీ హోం సర్వీస్ ద్వారా వచ్చినవారైతే రక్షణ ఏది అనే ప్రశ్న తలెత్తు తుంది. వారి ప్రాణాలు కూడా అపాయంలో పడతాయి.

రెవెన్యూశాఖ లో పనిచేసి పదవీవిరమణ చేసి విజయవాడ శివారులో అజిత్ సింగ్ నగర్లోని సొంత ఇంట్లో భార్యతో కలసి ఉంటున్నారు.వారివురు వృద్ధులు,వారి రోజువారీ ప్రకృతి సహజ అవసరాలకు మనిషిని పెట్టుకున్నారు.ఇటీవల పాత సహాయకురాలు మానివేసింది. కొత్త హోంసర్వీస్ కు మరో సహాయకురాలి కోసం ఫోన్ ద్వారా సంప్రదించారు. హోం సర్వీస్ నిర్వాహకుడు తమ నిబంధనల ప్రకారం మర్నాడు సహాయకురాలిని తీసుకుని వస్తానని అడ్వాన్స్ సగం మేరకు చెల్లించాలని చెప్పాడు.స్థానికంగా కావడంతో ఆ విధంగా చెప్పాడు. మర్నాడు ఉదయం చెప్పిన ప్రకారం నిర్వాహకుడు ఇద్దరు మహిళలతో ఇంటికి వచ్చాడు. వారిలో ఒక సహాయకురాలిని చూపి ఈమె మీకు సహాయం చేస్తుందని చెప్పాడు. అలాగే నెలకు సహాయకూరాలికి ఇవ్వాల్సిన మొత్తం ఇవ్వాలని అడిగాడు. దానికి తాను సగం మాత్రమే ఇస్తామన్నారు ఆవృద్ధుడు చెప్పాడు. చివరికి ఒప్పుకొని ఆయన ఇచ్చిన అడ్వాన్స్ తీసుకుని మరో మహిళతో వెళ్లిపోయారు. కొద్ది సేపటికి అసలు నిర్వాహకుడు మరో మహిళను తీసుకొని వచ్చాడు.దాంతో ఆశ్చర్యపోవడం వృద్ధదంపతుల వంతైంది. అప్పుడు అసలు మోసం వెల్లడైంది.దాంతో ముందుగా వచ్చిన సహాయకురాలిని పోలీసులకు పట్టిస్తామని బెదిరించారు ఆమె భయపడి నకిలీ నిర్వాహకునికి ఫోన్ చేసివివరం చెప్పింది.దాంతో నకిలీ నిర్వాహకుడు వచ్చి తాము తీసుకున్న సొమ్ము తిరిగి ఇచ్చి క్షమించమని కోరారు. సొమ్ము వచ్చింది కదా ఏమి చేయాలని ఆలోచిస్తుండగా నకిలీలు పరారయ్యారు. అసలు నిర్వాహకుని ఈ విషయం నకిలీలకూ ఏలా తెలిసిందని అడిగితే తనకు తెలియదన్నాడు. వారి హోంసర్వీస్ నుంచే ఈ వార్త లీక్ అయిందని వృద్ధదంపతులు అంటున్నారు.అతనేమో నావద్ద నుంచి కాదని చెబుతున్నాడు.నకిలీలు నెలమొత్తం వసూలు చేసి పారిపోవాలని ప్రణాళిక వేసారు.వృద్ధుడు గట్టిగా మాట్లాడడంతో ఏమీచేయలేక దొరికింది చాల్లే అని సరిపెట్టుకుని సర్దుకుందామనుకున్నారు.నకిలీ సహాయకురాలిని వదిలి వెళ్లిన తరువాత కొద్ది సేపటికీ ఆమె కూడా ఏదో సాకు చెప్పి పారిపోవాలని ప్లాన్ వేసారు.కాని ఊహించని విధంగా అసలు నిర్వాహకుడు రావడంతో కథ అడ్డం తిరిగింది.కాని చివరికి సుఖాంతం కావడంతో వృద్ధులు బయటపడ్డారు. ఇలాంటి వృద్ధుల రక్షణ దృష్ట్యా పోలీసువారు హోంసర్వీస్ లను క్రమబద్ధీకరించాల్సి ఉంది.అప్పుడే వృద్ధులకు రక్షణతో పాటు వారు పెట్టే డబ్బుకు న్యాయం జరుగుతుంది.

**యం.వి. రామారావు**

## చరిత్రలో ఈ రోజు (జూన్ 7)

**సంఘటనలు:**

1893: గాంధీజీ మొట్టమొదటి సహాయ నిరాకరణ.

1935: ఫ్రాన్స్ దేశానికి మొట్టమొదటి ప్రధాన మంత్రిగా పియెర్రీ లెవాల్.

1965: పెళ్ళి అయిన జంటలకు గర్భ నిరోధ పద్ధతులను చట్టబద్ధం చేస్తూ, అమెరికా సుప్రీం కోర్టు తీర్పు.

1966: మాజీ హాలీవుడ్ సినిమా నటుడు, రోనాల్డ్ రీగన్ 33వ కాలిఫోర్నియా గవర్నరు అయ్యాడు.

1967: ఆరు రోజుల యుద్ధంలో జెరూసలేం నగరంలోనికి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైనికులు.

1975: బీటా మాక్స్ వీడియో క్యాసెట్ రికార్డరును సోనీ విపణిలో ప్రవేశపెట్టింది.

1979: భాస్కర-1 అనే భారతీయ ఉపగ్రహం ప్రయోగించబడిరది.

1981: ఒపెరా పేరుతో ఇరాక్ లోని ఒసిరాక్ న్యూక్లియర్ రియాక్టరును ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది.

1991: అగ్ని పర్వతం పినతూబో పేలి, 7 కి.మీ (4.5 మై) ఎత్తుకు బూడిద చిమ్మింది.

**జననాలు:**

1953: లత , దక్షిణ భారత చలన చిత్ర నటి, టెలివిజన్ నటి

1960: సరిత, దక్షిణ భారత చలన చిత్రనటి

1974: మహేష్ భూపతి, భారత టెన్నిస్ క్రీడాకారుడు

1993: అనురాగ్ కులకర్ణి , నేపథ్య గాయకుడు .

**మరణాలు:**

1967: డొరొతీ పార్కర్, అమెరికాకు చెందిన కవయిత్రి, రచయిత్రి.

2002: బసప్ప దానప్ప శెట్టి, భారత రాజకీయ వేత్త, 5 వ ఉప రాష్ట్రపతి.

2005: బొల్లిముంత శివరామకృష్ణ, అభ్యుదయ రచయిత, ప్రజా కళాకారుడు, హేతువాది.

2011: నటరాజ రామకృష్ణ, పేరిణి శివతాండవము, నవజనార్దనం వంటి ప్రాచీన నాట్యరీతుల్ని తిరిగి వెలుగులోకి తెచ్చిన నాట్యాచార్యుడు.

2013: జె.వి.రాఘవులు, తెలుగు సినిమా సంగీత దర్శకుడు.

# కణాలకూ కొవ్వు పదార్థాల దెబ్బ



కొవ్వు ఎక్కువగా ఉండే పదార్థాలు తింటే బరువు పెరుగు తుందని తెలిసిందే. ఇవి చడీ చప్పుడు చేయకుండా కణ స్థాయిలో జీవక్రియనూ అస్తవ్యస్తం చేస్తున్నట్టు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) తాజా అధ్యయనం పేర్కొంటోంది. ఫలితంగా బరువుతో పాటు మధుమేహం వంటి దీర్ఘకాల జబ్బుల ముప్పు పెరగటానికీ దారితీస్తోందని వివరించింది. చక్కెర, కొవ్వు, ప్రొటీన్ జీవక్రియల్లో పాలు పంచుకునే వందలాది ఎంజైమ్‌ల పనితీరును అధిక కొవ్వు పదార్థాలు దెబ్బతీస్తున్నట్టు ఎలుకలపై నిర్వహించిన అధ్యయనం ద్వారా గుర్తించారు. ఇవి ఇన్సులిన్ నిరోధకత (కణాలు ఇన్సులిన్‌కు స్పందించకపోవటం), రియాక్టివ్ ఆక్సిజన్ స్పిసీస్ (ఆర్‌ఓఎస్) ఎక్కువ కావటానికి దారితీస్తున్నట్టు తేలింది. ఇన్సులిన్ నిరోధకతతో అధిక బరువు, మధుమేహం వచ్చే ఆస్కారముంది. ఆర్‌ఓఎస్ అనేవి ఆక్సిజన్‌తో కూడిన అస్థిర అణువులు. ఇవి కణాల్లోని ఇతర అణువులతో తేలికగా ప్రతిస్పందిస్తాయి. ఫలితంగా కణాలు దెబ్బతినే ప్రమాదముంది. వీటి అనర్థాలు మగ ఎలుకల్లో ఇంకాస్త ఎక్కువగా ఉండటం గమనార్హం. అయితే యాంటీఆక్సిడెంట్లను అదనంగా తీసుకోవటం ద్వారా ఇలాంటి హానికర ప్రభావాలను తగ్గించుకునే అవకాశమూ ఉందని అధ్యయనంలో బయటపడింది. విశృంఖల కణాల పనిపట్టే యాంటీఆక్సిడెంట్లు కణాల సమతుల్యతను పునరుద్ధరించటం, జీవక్రియల అస్తవ్యస్తాన్ని తగ్గించటం మంచి విషయం.

2nd pages1.qxd 6/6/2025 7:49 PM Page 5



# నమ్మివానిపేటలో దేవాలయం ప్రతిష్టాపన



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):–** స్థానిక మండలం జీవీఎంసీ 2వ వార్డు నమ్మివానిపేటలో శ్రీ శ్రీ శ్రీ మరిడమ్మ తల్లి దేవాలయం ప్రతిష్టాపన కార్యక్రమానికి భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ గంటా శ్రీనివాసరావుని ఉత్సవ కమిటీ పలు సాంస్కృతిక కార్యక్రమాలతో, డి. జె కొలాటంతో,మేలాలాతో సాదర స్వాగతం పలికారు. శ్రీ గంటా శ్రీనివాసరావు శ్రీ మరిడమ్మ తల్లి కి పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించి భక్తులతో మాట్లాడుతూ ఆలయం బాగా నిర్మించారని ఆలయకమిటీనీ కొనియాడారు. అమ్మవారిని భక్తి శ్రద్దలతో పూజించుకోవాలని అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని భక్తులకు తెలియజేశారు. ఈయొక్క కార్యక్రమానికి తెలుగుదేశం నాయకులు 2వ వార్డు కార్పొరేటర్ గాడు అప్పలనాయుడు , గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ లో పాల్గొని జయప్రదం చేసారు.

# గంటాను కలిసిన డిప్యూటీ మేయర్ దల్లి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును జీవీఎంసీ డిప్యూటీ మేయర్ గా ఎన్నికైన దల్లి గోవిందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జీవీఎంసీని అభివృద్ధి బాట పట్టించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని గంటా ఈ సందర్భంగా సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ తీసుకుని ప్రజల మన్ననలు పొందాలన్నారు. గోవిందరెడ్డిని శాలువా కప్పి అభినందించారు. కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మీ కూడా పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో మొక్కల పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు చేతులమీదుగా కలెక్టరేట్ అధికారులకు, సిబ్బందికి, సాధారణ పౌరులకు మొక్కలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ తమవంతు కృషి చేయాలని, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు.

# అయినవిల్లి తాసిల్దార్ పై హత్యాయత్నం



అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండల తహసిల్దార్ సి నాగ లక్ష్మమ్మ పై ఒక వ్యక్తి కత్తితో దాడి చేసి హత్యయత్నానికి పాల్పడ్డాడు. అయినవిల్లి మండలం జోగిరాజు పాలెం కు చెందిన మీసాల సత్యనారాయణ శుక్రవారం మధ్యాహ్నం అయినవిల్లి తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి విధి నిర్వహణలో ఉన్న తాసిల్దార్ నాగ లక్ష్మమ్మ పై కత్తితో దాడి కీ పాల్పడగా సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారం అందించారు. నాగ లక్ష్మమ్మ స్వల్ప గాయాలతో బయటపడగా నిందితుడిని అయినవిల్లి ఎస్ఐ శ్రీహరికోటి శాస్త్రి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

# పలు సమస్యలపై కమిషనర్‌కు వినతి



**పరవాడ,(విశాఖ సమాచారమ్):–** జీవీఎంసీ 85వ వార్డు ప్రజల యొక్క సమస్యలను ఇన్ ఛార్జ్ కమిషనర్ ఎం ఎన్. హరింద్ర ప్రసాద్ ను 85 వార్డ్ కార్పొరేటర్ ఇళ్ళపు వరలక్ష్మి ప్రసాద్ శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

# ప్రారంభమైన మూడురోజుల అంతర్జాతీయ మహిళా సదస్సు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య సన్నిధిలో, ప్రశాంతి నిలయం లో ప్రారంభమైన మూడు రోజుల అంతర్జాతీయ మహిళా సదస్సు లో, తొలి రోజు కార్యక్రమాల్లో భాగంగా, సమాజానికి నిరంతర సేవ చేస్తూ భగవాన్ ఆదర్శాలను ఆచరణలో పెట్టిన జాతీయస్థాయి ఆదర్శ మహిళా సమన్వయకర్తలకు ఘనంగా సన్మానం జరిగింది.

ఈ సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి (విశాఖపట్నం) చెందిన శ్రీ సత్య సాయి సేవా సంస్థలు రాష్ట్ర స్కిల్ డెవలెప్‌మెంట్ మహిళా ఇన్చార్జ్ అయిన భూపతిరాజు అమ్మాజీ గారిని, ఆదర్శ మహిళా సమన్వయకర్తగా ఎంపికచేసి సత్కరించారు.

ఈ ఘన సత్కారాన్ని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ధర్మపత్ని హిమవాహిని రత్నాకర్ అందజేశారు.

ఈ సందర్భంగా, శ్రీ సత్య సాయి సేవా సంస్థలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాధ్యక్షులు ఆర్. లక్ష్మణరావు, ఆంధ్ర ప్రదేశ్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని మహిళలను ఆర్థికంగా ఆత్మనిర్భరులుగా తయారుచేయడానికి అమ్మాజీ మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తారనే నమ్మకాన్ని వ్యక్తంచేశారు.

భారతదేశం మరియు ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన 12 మంది విశిష్ట శ్రీ సత్యసాయి మహిళలను తమ జీవితాలను సేవ, నాయకత్వం మరియు నిరంతర నిస్వార్థతకు అంకితంగా మార్చుకున్న ఈ మహిళలు, శ్రీ సత్యసాయి మిషన్ పట్ల చేసిన అసాధారణ సేవలకు గాను హిమవాహిని రత్నాకర్‌చే సత్కరింపబడ్డారు.

ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సంస్థల జాతీయ మహిళా సమన్వయకర్తలు శ్రీమతి కమలా పండ్యా, డా. నీతా ఖన్నా, డా. ఎల్. శశిబాల గార్లు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళా సాధికారత

శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ మహిళా ఇన్చార్జ్, విశాఖపట్నానికి చెందిన శ్రీమతి భూపతిరాజు అమ్మాజీ గారు, 2024–2025 సంవత్సరంలో 3,575 మంది మహిళలకు శ్రీ సత్యసాయి సేవా సంస్థ ల ద్వారా ఉచితంగా నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా అపూర్వమైన సేవను అందించారు.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారిఆదర్శాన్ని అనుసరించి, ఈ మహిళలు ఆత్మనిర్భరత వైపు అడుగులు వేయడంలో ఆమె ప్రేమతో కూడిన మార్గనిర్దేశనం ముఖ్యపాత్ర పోషించారు.

# 32వ వార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** జీవీఎంసీ 32 వ వార్డులో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు.

ఆయన చాంబర్లో కలిసి తమ వార్డు అభివృద్ధి పనులకు సంబంధించి పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సహకారంతో వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని పనులు పూర్తి అయినట్లు తెలిపారు. అయితే ఇంకా వార్డులో కొన్ని సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కార నిమిత్తం జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేసినట్లు వెల్లడించారు. గత పాలక మండలి లో విశాఖ నగర అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని చెప్పారు.

నేడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పడిన పాలకమండలి వార్డు అభివృద్ధి పనులకు పూర్తిగా సహకరించాలని కోరారు. వార్డులో ప్రధానంగా చలువ తోటలో అదనపు అంతస్తుతో నిర్మాణం సాగుతున్న కళ్యాణ మండపాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే పిల్లల కోసం నేరెళ్ల కోనేరు వద్ద ఒక పార్కును అలాగే యువకుల కోసం ఒక జిమ్ ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అల్లిపురం అలాగే నేరెళ్ల కోనేరు తో పాటు కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీ పూర్తిగా కొలాప్స్ అయిందని చెప్పారు. కొత్తగా డ్రైనేజీ పనులను ప్రారంభించాలని విన్నవించారు. అలాగే అండర్ గ్రౌండ్ వర్క్ త్వరగా పూర్తి చేయాలి అన్నారు.

గుంతల మయమైన రోడ్ల మరమ్మత్తు పనులను ప్రారంభించాలని కోరారు. ఇక తమ వార్డుకు రైల్వే స్టేషన్ దగ్గరగా ఉండటంతో బయట నుంచి వచ్చే వ్యక్తులు ఇక్కడ డ్రగ్స్ అలాగే గంజాయి అమ్మకాలు చేస్తుండటం తో పాటు వాటిని సేవిస్తున్నారని తెలిపారు. వీరి వల్ల స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. ఇప్పటికే ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని చెప్పారు. తమ వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు చేపడుతున్న వారి ఆట కట్టించాలని విజ్ఞప్తి చేశారు. ఏడు గుళ్ళ స్లమ్ ఏరియా విశాఖలో 70 ఏళ్ళ నుంచి ఉందని, ఈ ప్రాంతంలో సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుని ఇక్కడి వారికి పక్కా గృహాలను ఏర్పాటు చేయాలని కోరారు. డాక్టర్ కందుల నాగరాజు విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వినతులను పూర్తిగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే 32 వార్డును సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించి తమ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# టీడీపీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక : గండి బాబ్జి



**పరవాడ, (విశాఖ సమాచారమ్):–** పెందుర్తి నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరవాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో %ఝూూ×ూఖీజుణ% చైర్మన్, విశాఖ జిల్లా పార్లమెంటు అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గ ప్రజలు నాయకులు నలుమూలలు నుంచి వచ్చి సుమారు 55 పిర్యాదులు అందజేశారు. పార్మసిటీ కంపెనీల పొల్యూషన్ మరియు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు రెవెన్యూ సమస్యలు ,పెన్షన్ లు పై ఎక్కువగా పిర్యాదులు రావటం విశేషం. సంబంధించిన అధికారులుతో మాట్లాడి సమస్యలు త్వరతగిన పరిష్కారం చేయాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఈ వియ్యపు చిన్నా, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, తానం సర్పంచ్ కన్నూరు దేవి వెంకట రమణ, ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు , అట్టా సన్యాసి అప్పారావు, జిల్లా టిడిపి సాంస్కృత విభాగం అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, మండల టిడిపి యువజన అధ్యక్షుడు పైల అక్కునాయుడు, ఇందల కొండలరావు, బొండా తాతారావు, బొండా సన్నిదేముడు,సూరాడ బంగారు రాజు, రాయవరపు దేవుడు, కోమటి వెంకటరమణ, రొంగల గోపాల కృష్ణ, బంధం వెంకటరమణ,గొర్లె కనకారావు, సారిపల్లి జోగి నాయుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం గోడ పత్రికల ఆవిష్కరణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకై రక్తదానం చేద్దామని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ అన్నారు. నేడు స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో 8 వసారి జరుగుతున్న రక్తదానం గోడపతులను స్టీల్ సిఐటియు నాయకులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జె అయోధ్య రామ్ మాట్లాడుతూ గడచిన ఏడుసార్లు రక్తదానం చేసి స్టీల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్ 100% వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా గడచిన 1600 రోజులుగా ఐక్య పోరాటాలతో ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకోవాలని పోరాటం చేస్తున్నామని ఆయన అన్నారు. కానీ ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించి కార్మికుల జీవితాలను, ప్లాంట్ భవిష్యత్తును మరింత సంక్షోభంలోకి నెట్టే విధంగా చర్యలు చేపడుతోందని ఆయన వివరించారు. ఈ సమయంలో కార్మిక వర్గం మరింత ఐక్యంగా తమ రక్తాన్ని కూడా దానం చేసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళవలసిన సమయం ఆసన్న మైందని ఆయన అన్నారు. కనుక పెద్ద ఎత్తున కార్మిక వర్గం ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రక్తదాన శిబిరం నిర్వాహకులు బి అప్పారావు మాట్లాడుతూ గడచిన ఏడు సంవత్సరాలలో మనందరం కలిసి చేసిన రక్తదానం ద్వారా అనేకమందికి రక్తం అవసరాలను తీర్చగలిగామని ఆయన వివరించారు. జూన్ 14 ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఉక్కునగరం ( సి డబ్ల్యూ సి–1) అంబేద్కర్ కళాక్షేత్రంలో దీనిని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. దీనిలో స్టీల్ కుటుంబీకులు మరియు స్టీల్ కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన అభ్యర్థించారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినోత్సవం ద్వారా రక్తాన్ని సేకరించి రక్తం అవసరాన్ని కొద్దిగా అయినా తీర్చాలన్న మహోన్నత ఆశయం ఉందని ఆయన అన్నారు. ఈ మహోన్నత ఆశయంలో స్టీల్ కార్మిక వర్గం ముందు పీఠిన నిలిచారని ఆయన వివరించారు. ఇప్పటికే అనేకసార్లు రక్తదానం చేసిన వారీగా స్టీల్ కార్మికులు గుర్తింపు పొందారని ఆయన అన్నారు. కనుక రక్తదానం చేయడానికి పెద్ద ఎత్తున కార్మిక వర్గం సిద్ధం కావాలని ఆయన అభ్యర్థించారు ఈ కార్యక్రమం లో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, కె గంగాధర్, విడివి పూర్ణచంద్ర రావు,కె శ్రీనివాస్, సూరిబాబు శ్రీనివాసరెడ్డి,బొంజు బాబు, పిజికె రాజు,కోయిలాడ శ్రీనివాస్ తదితరుల తో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ కరెంట్ ఎఫైర్స్

**20 ఫిబ్రవరి**

**అంతర్జాతీయ ముప్పుగా మెదడువాపు**

**గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ**

అంటు, స్వయం ప్రతిరక్షక రోగంగా గుర్తించిన మెదడువాపు వ్యాధిని అంతర్జాతీయ ముప్పుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) గుర్తించింది. దీంతో ఇది తక్షణ ప్రజారోగ్య ప్రాధాన్యంగా మారింది. డబ్ల్యూహెచ్‌వో, ఎన్‌సెఫలిటిస్ ఇంటర్నేషనల్ ఈ వ్యాధిపై క్లిష్ట సాంకేతిక సమాచారాన్ని అందించడం ప్రారంభించాయి. వాటిలో ప్రపంచవ్యాప్తంగా ఆ వ్యాధితో ఇబ్బందులు, దాని నిరోధానికి తీసుకోవలసిన మరిన్ని చర్యలు, సమాచార సేకరణ–పర్యవేక్షణ, రోగనిర్ధారణ, చికిత్స, చికిత్సానంతర సంరక్షణ, అవగాహన, పరిశోధనల అవిష్కరణలు లాంటివి ఉన్నాయి.

**19 ఫిబ్రవరి**

**డబ్ల్యూహెచ్‌వో చట్రంలోకి ఆయుర్వేదం**

డబ్ల్యూహెచ్‌వో ఏటా విడుదల చేసే వ్యాధి గణాంకాల నమోదు, విశ్లేషణ, వ్యాఖ్యానాల సంకలనం (ఐసీడీ)– 11లో సంప్రదాయ వైద్యరీతులకు స్థానం కల్పించింది. దీనికి సంబంధించి తాజా ఐసీడీ–11లో కొత్త మాడ్యూల్‌ను ప్రవేశపెట్టారు. దీంతో దేశీయ వైద్య రీతులైన ఆయుర్వేద, సిద్ధ, యునానీలకూ అంతర్జాతీయ గుర్తింపు లభించినట్లైందని ఆయుష్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. జాతీయ వైద్య సేవా వ్యూహాల్లో, వైద్య విధానాల్లో దేశీయ వైద్యానికి స్థానం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయుష్ శాఖ పేర్కొంది.

**16 ఫిబ్రవరి**

**జులైలో బ్రెజిల్ వేదికగా బ్రిక్స్ సదస్సు**

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రియో డి జనీరోలో జరుగనున్నట్లు బ్రెజిల్ ప్రభుత్వం ప్రకటించింది. జులై 6, 7 తేదీల్లో దీనిని నిర్వహించనున్నట్లు ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి మౌరో వియోరా పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల అభివృద్ధి, సహకారం, ప్రజల జీవితాలను మెరుగుపరిచేందుకు ఈ సదస్సులో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. గతేడాది అక్టోబరులో రష్యాలోని కజాన్ నగరం వేదికగా ఈ సదస్సు జరిగిన సంగతి తెలిసిందే.

**15 ఫిబ్రవరి**

**369 మంది పాలస్తీనా ఖైదీలను వదిలిన ఇజ్రాయెల్**

గాజా కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశలో భాగంగా ఆరోవిడత బందీల మార్పిడి సాఫీగా సాగింది. దక్షిణ గాజాలో ముగ్గురు బందీలను హమాస్ విడుదల చేసింది. ఇజ్రాయెలీ–అర్జెంటీనా ఇయార్ హార్న్ (46), అమెరికన్–ఇజ్రాయెలీ సగోయ్ డెకెల్ చెన్ (36), రష్యా– ఇజ్రాయెలీ అలెగ్జాండర్ ట్రుఫనోవ్ (29)లను రెడ్‌క్రాస్‌కు అప్పగించింది. ప్రతిగా ఇజ్రాయెల్ 369 మంది పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టింది.

**రెడీ టు ఈట్ ఫుడ్స్‌లో కర్రీ చికెన్ బిర్యానీ**

జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందజేసే రెడీ టు ఈట్ ఆహారాల్లో బిర్యానీ రైస్‌తో కర్రీ చికెన్‌కు చోటు లభించింది. సింగపూర్ ఎయిర్‌పోర్ట్ టర్మినల్ సర్వీసెస్ (శాట్స్ లిమిటెడ్) సిద్ధం చేసిన 5 ఆహారాల్లో ఇదీ ఒకటి. వీటి ఎంపికకు 4–6 నెలల పాటు శాట్స్ పరిశోధన చేసింది. ఇది కాకుండా.. చికెన్ బోలోగ్నీస్ పాస్తాబీ చిలగడ దుంప, గుమ్మడికాయతో చేసిన చేప గంజి, బిర్యానీ రైస్‌తో పాటు స్వీట్ స్పైసీ టమాట ఫిష్, వెజిటబుల్ మెరినారా పాస్తా ఉన్నాయి. వీటిని రిఫ్రిజిరేషన్ అవసరం లేకుండా, వేడి చేసుకోకుండానే తినొచ్చు. 8 నెలల పాటు నిల్వ ఉంటాయి. వాస్తవ పరిస్థితుల్లో నిల్వ సామర్థ్యాన్ని పరీక్షించాక, వీటి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభిస్తామని శాట్స్ అంటోంది. ఈ ఏడాది ఎక్సర్సైజ్ ఎస్‌జీ రెడీలో భాగంగా 1,50,000 భోజనాలను ఫిబ్రవరి 15–28 మధ్య పంపిణీ చేయనున్నారు.

**14 ఫిబ్రవరి**

**భారత్‌కు ఎఫ్–35**

యుద్ధ విమానాలను విక్రయించేందుకు అమెరికా అంగీకారం

భారత రక్షణ సామర్థ్యాలు మరింత ఇనుమడించేలా కీలక ముందడుగు పడింది. శత్రుభీకరమైన ఎఫ్–35 యుద్ధవిమానాలను మన దేశానికి విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. వాషింగ్టన్‌లో ప్రధాని మోదీతో భేటీ అనంతరం అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ మేరకు ప్రకటన చేశారు.

శ్వేతసౌధంలో ఈ ఇద్దరు నేతలు సమావేశమై.. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై విస్తృతంగా సమాలోచనలు జరిపారు. అనంతరం దిల్లీకి అనుకూలంగా పలు నిర్ణయాలు వెలువడ్డాయి. అమెరికా నుంచి చమురు, గ్యాస్ కొనుగోళ్లను పెంచడంతోపాటు 26/11 ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వూర్ రాణాను భారత్‌కు అప్పగించడం వంటివి అందులో ఉన్నాయి.

సుంకాల విషయంలో దిల్లీకి మినహాయింపులేవీ ఉండబోవని ట్రంప్ స్పష్టంచేయడం కాస్త ఇబ్బందికర అంశమే అయినా.. ద్వైపాక్షిక వాణిజ్య బంధం విలువను 2030 కల్లా 50 వేలకోట్ల డాలర్లకు పెంచుకునేలా మెగా వాణిజ్య ఒప్పందాన్ని త్వరలో కుదుర్చుకుంటామని ఇరుదేశాలూ ప్రకటించడం ఊరట కలిగించేదే.

అమెరికా నుంచి చమురు, గ్యాస్ కొనుగోళ్లను పెంచడంతోపాటు 26/11 ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వూర్ రాణాను భారత్‌కు అప్పగించడం లాంటి పలు నిర్ణయాలు వెలువడ్డాయి.

ద్వైపాక్షిక వాణిజ్య బంధం విలువను 2030 కల్లా 50 వేలకోట్ల డాలర్లకు పెంచుకునేలా మెగా వాణిజ్య ఒప్పందాన్ని త్వరలో కుదుర్చుకుంటామని రెండు దేశాలూ ప్రకటించాయి.

**మోదీకి ట్రంప్ ప్రత్యేక కానుక**

అమెరికా పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీకి ట్రంప్ ప్రత్యేక బహుమతి ఇచ్చారు. తాను స్వయంగా రాసిన 'అవర్ జర్నీ టుగెదర్' అనే పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చోటుచేసుకున్న ప్రధాన ఘట్టాలతో కూడిన ఫొటోబుక్ ఇది. 2019లో మోదీ అమెరికాలో నిర్వహించిన 'హౌడీ మోదీ', 2020లో ట్రంప్ భారత్‌కు విచ్చేసినప్పుడు ఏర్పాటుచేసిన 'నమస్తే ట్రంప్' కార్యక్రమాల ఫొటోలు కూడా అందులో ఉన్నాయి. పుస్తకంపై 'మిస్టర్ ప్రైమ్‌మినిస్టర్, యూ ఆర్ గ్రేట్' అని రాసి ట్రంప్ సంతకం చేశారు.

**10 ఫిబ్రవరి**

**ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకం**

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంచలన నిర్ణయాలు తీసుకుంటున్న డొనాల్డ్ ట్రంప్ ఆ పరంపరను కొనసాగిస్తున్నారు. తాజాగా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. అధిక వ్యయం కారణంగా నాణేలను ముద్రించడం నిలిపేయాలని ఆర్థికశాఖను ఆదేశించారు. ఫిబ్రవరి 9వ తేదీని గల్ఫ్ ఆఫ్ అమెరికా దేగా ప్రకటించారు. ఇక కెనడాను 51వ రాష్ట్రంగా బలంగా కోరుకుంటున్నానని స్పష్టం చేశారు.

**– డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి**

**విశాఖ సమాచారమ్ 9553574250**

2nd pages1.qxd 6/6/2025 7:49 PM Page 6



# గోదావరి జిల్లాల సమాచారమ్

## చింత వారి రామాలయంలో అభయ ఆంజనేయుడు కళ్ళు తెరిచి దర్శనమిచ్చాడు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో చింతా వారు రామాలయంలో అభయ ఆంజనేయుడు కళ్ళు తెరిచి దర్శనం ఇచ్చారు.

వివరాల్లోకెళ్తే : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గంలో చింతా వారి కుటుంబం అంటే పెద్ద పేరు. చింతా వారి పూర్వీకులైన చింతా. వెంకటేశ్వరరావు గారిచే సుమారు 180 సంవత్సరాల కిందట నిర్మించబడిన సీత రాముల ఆలయం. మరమ్మతులు రీత్యా ఆలయాన్ని కూల్చి మరలా ఆయన మనవడు చింతా. బుజ్జి ద్వారా నూతనంగా నిర్మించబడిన శ్రీ సీతారాముల మందిరములో సీతారాములు వారికి, దుర్గామాత, విగ్నేశ్వరుడు విగ్రహాలను ప్రతిష్టించడం జరిగింది. అదే ఆలయంలో అభయాంజనేయులు విగ్రహం కూడా ప్రతిష్టించడం జరిగింది. అభయాంజనేయులు పూజలు అనుకుంటున్నా కొన్ని గంటల్లోనే కళ్ళు తెరిచి భక్తులకు దర్శనమిచ్చాడు. ఆ దృశ్యాన్ని తిలకించిన భక్తులు ఆశ్చర్యానికి లోనవి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. ఇటువంటి అద్భుతమైన ఆలయాన్ని నిర్మించిన చింతా వారి కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు. అభయ ఆంజనేయుడు కళ్ళు తెరిచి దర్శనమిచ్చిన అప్పటినుండి ఈ చింత వారి రామాలయానికి భక్తుల రద్దీ ఎక్కువైంది అని చెప్పుకోవచ్చు.

## కాకినాడలో 41 కరోనా యాక్టివ్ కేసులు


**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** కాకినాడ జిల్లాలో ప్రస్తుతం 41 కరోనా యాక్టివేషన్ ఉన్నాయని ప్రభుత్వాసుపత్రి సూపరెంటెంట్ డాక్టర్ లావణ్య తెలిపారు. కరోనా ప్రారంభ దశ నుండి గురువారం వరకు 258 మందికి ఆర్టిపిసిఆర్ పరీక్షలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు గురువారం ఒకరోజు 40 మందికి పరీక్షలు నిర్వహించగా ముగ్గురికి పాజిటివ్ వచ్చినట్లు ఆమె వెల్లడించారు. జిల్లా ప్రజలందరూ కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని, గుంపులుగా ఉండవద్దని పలు జాగ్రత్తలు సూచించారు. ప్రజలు ఎవ్వరు ఆందోళన చందవద్దని ఆమె అన్నారు.

## దళితులను విద్యకు దూరం చేయొద్దు



**కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):–** ఎస్సీ ఏరియాలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తరలిస్తే తమ పిల్లలు విద్యకు దూరం అవుతారని దొమ్మేరు ఇందిరమ్మ కాలనీవాసులు వాపోయారు. కొవ్వూరు మండలం దొమ్మేరు ఇందిరమ్మ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(స్పెషల్)ను వేరే పాఠశాలలో విలీనం చేయడంపై గ్రామస్తులు కొవ్వూరులోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి నాగరాజు, సర్పంచ్ తానేటి కుమారి, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు రౌతు రాణి, పొసిపో బేబి, అనిమిల్లి జానేంద్ర ఎంఈవో కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు చదివేవారు 33 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాల విద్యాకమిటీ, విద్యార్థుల తల్లిందండ్రులు, సర్పంచ్ పాఠశాలల తరలించరాదని చెప్పినప్పటికీ, తాము అనుకూలంగా సంతకాలు చేసినట్టు అధికారులు నివేదిక పంపడం ఏంటని ప్రశ్నించారు. 1930లో ఏర్పడిన ఈ పాఠశాల ద్వారా దళితుల పిల్లలు విద్య నేర్చుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఫౌండేషన్ స్కూల్ చేయడం వల్ల ఇక్కడ కేవలం 1,2 తరగతులు మాత్రమే మిగులుతాయని తెలిపారు. ఎంఈవో బి స్వరూప్‌కు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వరిగేటి సుధాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు జి.సునీల్, కె.రాజేష్, ఎ.లక్ష్మి, యాగంటి శాంతకుమారి పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీల్లో కార్టూనిస్ట్ శేఖర్‌కు బహుమతి




**రాజమహేంద్రవరం, (విశాఖ సమాచారమ్):–** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఛత్తీస్‌గఢ్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ బోర్డ్, కార్టూన్ వాచ్ పత్రికల సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయిలో నిర్వహించిన కార్టూన్ పోటీల్లో నగరానికి చెందిన కార్టూనిస్ట్ శేఖర్ తృతీయ బహుమతి సాధించారు. నిర్వాహకులు త్రియంబక్ శర్మ ఆ వివరాలను వెల్లడించారు. ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్, వీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విజేతలకు నగదు బహుమతితోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నారు. బహుమతి పొందిన కార్టూన్‌లను నగర కూడళ్లలో హోర్డింగ్స్, వాల్‌పోస్టర్‌లు, కరపత్రాల ద్వారా ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది.

## ఫోర్జరీ పోలీస్!



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):–** తన స్థాయిని పెంచుకుని అడ్డగోలు దందాలకు పాల్పడేందుకు ఒక హెడ్ కానిస్టేబుల్ ఏకంగా డీఐజీ సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. తనకు తానే ఎస్ఐగా ఐడీ కార్డును తయారు చేసుకున్నాడు. దాన్ని చూపించి ఎస్ఐగా చెప్పుకొంటూ చెలరేగిపోతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొప్పిశెట్టి యోగి కామేశ్వరురావు గవర్నమెంట్ రైల్వే పోలీస్ విభాగం(జీఆర్పీ)లో స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు.

రాజమహేంద్రవరం రైల్వే సబ్ డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన కొద్దికాలం కిందట రాష్ట్ర ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్ డీఐజీ సంతకాన్ని ఫోర్జరీ చేసి తన పేరిట ఎస్ఐగా ఐడీ కార్డు తయారు చేసుకున్నాడు. దాన్ని చూపిస్తూ రాజముహేంద్రవరం రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాతోపాటు కాకినాడ, తుని, సామర్లకోట, అన్నవరం, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లలో ఉద్యోగులపై అజమాయిషీ చేసేవాడు. కొన్ని కేసులను ఎస్ఐ హోదాలో సొంతంగా విచారణ చేసి డబ్బులు వసూలు చేయడం, చోరీ కేసుల్లోనూ రికవరీలు చేయడం వంటి ఆరోపణలు ఉన్నాయి.

ఈ క్రమంలో కాకినాడకు చెందిన ఓ జవాన్ తనను వేధిస్తున్నాడని అతని భార్య నగరంలోని దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జవాన్ సోదరుడైన రైల్వే కానిస్టేబుల్, అతని తల్లి పేర్లను కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. రైల్వే కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేయడంతో విచారణ కోసం జీఆర్పీ స్టేషన్‌కు పంపారు. దీంతో వివరాలు సేకరించేందుకు వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ కామేశ్వరరావు... విచారణ పేరుతో రైల్వే కానిస్టేబుల్ భార్యను మరో ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి బెదిరించాడనే ఆరోపణలు ఉన్నాయి.

ఫిర్యాదు చేసిన జవాన్ భార్యను రైల్వే గెస్ట్ హౌస్‌కి అనధికారికంగా తీసుకెళ్లి విచారించడం వివాదాస్పదంగా మారింది. అదే సమయంలో కామేశ్వరరావు నకిలీ ఐడీ కార్డు చూపించి తాను ఎస్ఐని అని బెదిరించాడని రైల్వే కానిస్టేబుల్ భార్య కాకినాడ టూ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు డీఐజీ సంతకం ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. మరికొందరు కూడా అతనిపై జీఆర్పీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో నకిలీ ఐడీ కార్డును ఎక్కడెక్కడ ఉపయోగించారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

కామేశ్వరరావుపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ చేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీకి జీఆర్పీ అధికారులు సిఫార్సు చేశారు. రైల్వే నుంచి తిరిగి అతని మాతృవిభాగమైన అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయానికి బుధవారం పంపించారు. అతనికి సహకరించిన మరికొందరిని కూడా జీఆర్పీ నుంచి బదిలీ చేశారు. విశాఖ రేంజ్‌కి చెందిన స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఈ నెల ఒకటో తేదీన కాకినాడ వచ్చి కామేశ్వరరావుపై ఫిర్యాదు చేసిన బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కామేశ్వరరావుపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేస్తున్నామని, బాధితులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు తెలిపారు.

## రహదారి ప్రమాదంలో ఇంజినీరు మృతి



**మొగల్తూరు:** 216 జాతీయ రహదారిపై మొగల్తూరు– ముత్యాలపల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెనపై జరిగిన రహదారి ప్రమాదంలో సమగ్రశిక్షా అభియాన్ ఇంజినీరు కర్రి వెంకటరెడ్డి మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. పెనుమంట్ర మండలం నెగ్గిపూడికి చెందిన కర్రి వెంకటరెడ్డి (42) విద్యాశాఖకు చెందిన సమగ్రశిక్షా అభియాన్ మచిలీపట్నం విభాగంలో సైట్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. ఆయన స్వగ్రామంలోని తన ఇంటికి కారులో వెళ్తుండగా మొగల్తూరు వైపు నుంచి ముత్యాలపల్లి వైపు వేగంగా వెళ్తున్న రొయ్యల రవాణా వాహనం ఢీ కొట్టి కొంతదూరం ఆ కారును ఈడ్చుకు వెళ్లింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. అనంతరం ఆ వాహనం వంతెన రెయిలింగ్‌ను ధ్వంసం చేసుకుంటూ వెళ్లి క్యాబిన్ కొంతమేర ఉప్పుటేరు వైపు వెళ్లి ఆగింది. ఆ వాహనంలో ఉన్న క్లీనరు ఉప్పుటేరులోకి పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌కు ఏమీ కాలేదు. సమాచారం అందుకున్న అత్యవసర వాహన పైలట్ బి.రత్నసాగర్, ఈఎంటీ ఎ.రాజేష్ అక్కడకు చేరుకుని కొన ఊపిరితో ఉన్న వెంకటరెడ్డికి సీపీఆర్ చేశారు. అనంతరం నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటరెడ్డికి ఇటీవలే వివాహమైంది. ప్రమాద ఘటనపై భార్య మేఘన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై జి.వాసు తెలిపారు.

## ఆలయాల్లో చోరీ.. గోవాలో జల్సా

**రాజమహేంద్రవరం, (విశాఖ సమాచారమ్):–** చిన్న వయసు నుంచే మద్యం, జూదం వంటి దురలవాట్లకు బానిసయ్యాడు. ఆటో అద్దెకు తీసుకొని నడుపుతూ వచ్చిన సొమ్ము వ్యసనాలు, జల్సాలకు చాలకపోవడంతో ద్విచక్ర వాహనాలు, తాళం వేసిన ఇళ్లలో చోరీలు మొదలెట్టాడు. పలు కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లాడు. అయినా ప్రవర్తన మారకపోగా బెయిల్‌పై బయటకు వచ్చి రాజమహేంద్రవరం పరిసరాల్లోని ఆలయాలు, గుళ్లలో హుండీలు పగులగొట్టి నగదు దొంగలించసాగాడు. ఇలా అయిదుచోట్ల చోరీలకు పాల్పడ్డాడు. చివరికి రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీసులకు చిక్కాడు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా తొండంగి మండలం ఆనూరుకు చెందిన పారేపల్లి బాబి(25) ఆటో నడుపుతూ రాజమహేంద్రవరం లింగంపేట రోడ్డులో ఉన్న పోలీసులను చూసి పరారయ్యే ప్రయత్నం చేయగా ఎస్సై అప్పలరాజు అదుపులోకి తీసుకున్నారు.



ఆ ఆటోలో ఎలక్ట్రికల్ కట్టర్ ఉండడంతో స్టేషన్‌కు తరలించి విచారించగా హుండీ చోరీల విషయం వెలుగు చూసింది. ఇటీవల కాలంలో మూడో పట్టణ స్టేషన్ పరిధిలోని నాలుగు, కోరుకొండ పీఎస్ పరిధిలో ఒక చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గతంలో పాయకరావుపేట, తుని, నర్సీపట్నం పీఎస్‌లలో వివిధ చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలుసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.95 వేలు నగదుతోపాటు ఆటో, కట్టర్ స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు పాల్పడగా వచ్చిన నగదుతో గోవా వెళ్లే ప్రయత్నంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సీఐ వి.అప్పారావు, ఎస్సై అప్పలరాజు, హెచ్‌సీ టి.లోవకుమార్, పీసీలు బి.విజయ్‌కుమార్, పి.మహేష్ కుమార్, కె.పవన్‌కుమార్, కె.శ్రీనివాస్‌లను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

## ద్విచక్ర వాహనాలపై పీడీఎస్ బియ్యం తరలింపు



**సీతానగరం, (విశాఖ సమాచారమ్):–** సీతానగరం మండలం ముగ్గళ్ల నుంచి కొంతమంది ద్విచక్ర వాహనాలపై రేషన్ బియ్యం బస్తాలను తరలించడంపై తీవ్ర కలకలం రేగింది. ప్రభుత్వం సరఫరా చేసిన గన్నీ బ్యాగులను కూడా కనీసం మార్చకుండా ఈ బస్తాలు ద్విచక్ర వాహనాలపై ఎక్కిస్తుండగా ఫోటోలు తీసి కొంతమంది సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. చౌకధరల దుకాణాల ద్వారా గత 5 రోజులుగా నిత్యావసర సరకుల పంపిణీ జరుగుతోంది. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం ఇచ్చే సమయంలో అదే వాహనాల్లో బియ్యం కొనుగోలు చేసి బయటకు తరలించే పరిస్థితులు ఉండేవి. అలా తరలించే సమయంలో గన్నీ బ్యాగుల్లో కాకుండా ప్లాస్టిక్ సంచుల్లో బియ్యం నింపేవారు. ఇప్పటికీ కాకినాడ పోర్టుకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా ఆగకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఎండీయూ వాహనాలు నిలిచిపోయి దుకాణాలు తెరవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డుకట్ట పడినట్లయింది. దీనివల్ల ఎప్పటికప్పుడు సరకు నిల్వలు తేలే పరిస్థితి ఉండటంతో కొనుగోలు చేసిన బియ్యాన్ని వేరే ప్రాంతానికి ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నట్టుగా చెబుతున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ వ్యవహారంపై సీతానగరం తహసీల్దారు శ్రీనివాసు మాట్లాడుతూ శుక్రవారం విచారణ చేస్తామన్నారు.

## ప్రవీణ్ సంస్మరణ సభకు అనుమతి

**రాజమహేంద్రవరం, (విశాఖ సమాచారమ్):–** హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు హైకోర్టు లైన్ క్లియర్ చేసిందని, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తరఫు న్యాయవాది బాల గురువారం విలేకర్లకు తెలి పారు. గత నెల 24న ప్రవీణ్ పడగాల సంస్మరణ సభ నిర్వహించేందుకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో హర్షకుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా న్యాయవాది బాల హైకోర్టులో వాదనలు వినిపిస్తూ.. మే 28న కడపలో నిర్వహించిన టీడీపీ మహానాడుకు అనుమతి ఇచ్చారని, అటువంటిది సామాన్య ప్రజలు సంస్మరణ సభ నిర్వహించేందుకు అనుమతులు నిరాకరించారని ప్రస్తావించారు. వాదనల అనంతరం, ప్రవీణ్ సంస్మరణ సభకు సంబంధించి కొత్తగా చేసే దరఖాస్తుపై నాలుగు వారాల్లో ఏదో ఒక రోజు అనుమతివ్వాలంటూ జిల్లా ఎస్పీని ఆదేశించిందని బాల తెలిపారు. సభ అనుమతుల కోసం త్వరలోనే జిల్లా పోలీసు కార్యాలయంలో దరఖాస్తు చేస్తానని, ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో సభ నిర్వహిస్తామని హర్షకుమార్ తెలిపారు.

## సెలవుల్లో తరగతుల నిర్వహణపై ఆగ్రహం




**ఏలూరు, (విశాఖ సమాచారమ్):–** వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న నగరంలోని విద్యానగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపు రద్దుచేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తరగతులు బాయ్ కాట్ చేయించి విద్యార్థులను ఇంటికి పంపించి వేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ వేసవి సెలవుల్ని పక్కన పెట్టి గురువారం నుంచి ఈ పాఠశాలలో తరగతులు నిర్వహించడం అంటే విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించడమే అన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్ష కూడా నిర్వహించడం గుర్తించామన్నారు. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన ఈ బ్రాంచ్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు వై.యశ్వంత్ పాల్గొన్నారు.

## శివాలయం నిర్మాణానికి అడ్డుపడొద్దంటూ ఆందోళన

### నినాదాలు చేస్తున్న గ్రామస్థులు



**పెంటపాడు, (విశాఖ సమాచారమ్):–** పెంటపాడు మండలం ప్రత్తిపాడులో నిర్మిస్తున్న శివాలయం నిర్మాణానికి అడ్డుపడొద్దంటూ గ్రామస్థులు గురువారం ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రత్తిపాడులో శివాలయం లేకపోవడంతో గ్రామస్థులంతా చందాలు వేసుకొని ఆరుగొలను రోడ్డు పక్కనున్న స్థలంలో ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు ఆలయం నిర్మాణం చేస్తున్న స్థలం ప్రభుత్వానిదంటూ వేర్వేరుగా కోర్టుకెళ్లారు. న్యాయస్థానం ఒక కేసులో శివాలయం నిర్మాణంపై స్టే విధించగా, మరొక కేసు కంటెంట్ ఆఫ్ కోర్టులో ఉంది. న్యాయస్థానం ఇచ్చిన స్టేను ధిక్కరించి ఆలయాన్ని నిర్మిస్తుండటంతో గురువారం పోలీసుల సహకారంతో అధికారులు శివాలయాన్ని తొలగించేందుకు వెళ్లారు. ఇది తెలుసుకున్న గ్రామస్థులు, హిందూ సంఘాలు అక్కడి చేరుకొని ఆందోళన చేపట్టారు. అధికారులు వెనక్కి వెళ్లిపోవాలంటూ నినాదాలు చేశారు. దీంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. దీనిపై ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వీర్ల కృష్ణ మాట్లాడుతూ గ్రామంలో శివాలయం లేకపోవడంతో తాడేపల్లిగూడెం పట్టణం వెళ్లి పూజలు చేసుకుంటున్నామన్నారు. గ్రామంలో శివాలయాన్ని నిర్మించాలని గ్రామస్థులంతా సిద్ధపడితే కొందరు వ్యక్తులు అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆందోళన కారుల ధాటికి అధికారులు వెనుదిరిగారు. కొద్దిసేపటికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అక్కడికి చేరుకొని అధికారులు చేస్తున్న పనికి అడ్డుపడొద్దని గ్రామస్థులకు నచ్చచెప్పారు. శివాలయం సమస్యని త్వరలో పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమణిగింది. ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ, తహసీల్దార్ సీతారత్నం, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 'గోదావరి గట్టుపై విగ్రహాల తొలగింపు ఉండదు'





**రాజమహేంద్రవరం, (విశాఖ సమాచారమ్):–** ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే : గోదావరిగట్టుపై అభివృద్ధి పేరుతో జరిగే నిర్మాణ కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖుల విగ్రహాల తొలగింపు ఉండదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గురువారం కృష్ణసాయి కల్యాణ మండపంలో న్యాయవాది మద్దూరి శివసుబ్బారావు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ విగ్రహాలు తొలగించాల్సి వస్తే నగరపాలకసంస్థ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. అపరకర్మల నిర్వహణకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గోదావరిగట్టు అభివృద్ధిలో ఎవరి మనోభావాలు దెబ్బతీయమన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ హామీ ఇచ్చిన విధంగా వ్యవహరించాలని, ఎనిమిది కోట్లతో జరిగే అభివృద్ధి కార్యక్రమాల వివరాలు బహిర్గతం చేయాలని సూచించారు. వైకాపా అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ గతంలో ఇదే గోదావరిగట్టు అభివృద్ధి కోసం రూ. 22 కోట్లతో బ్లూ ప్రింట్ ప్రకటించామని గుర్తు చేశారు. సీపీఐ నాయకుడు టి.మధు మాట్లాడుతూ పుష్కరాలు సమీపిస్తున్న తరుణంలో కేవలం సుందరీకరణకే కాకుండా నగర ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. సీసీసీ ఛైర్మన్ పంతం కొండలరావు మాట్లాడుతూ విజయవాడకు వెళ్లే వాహనాలన్నీ సీతంపేట నుంచి వెళ్లడం వలన ట్రాఫిక్ పెరుగుతోందని, వీటిని నివారించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ తమ హయాంలోనే గోదావరి వరద నీరు పోటెత్తకుండా కాంక్రీటు గోడను పటిష్టంగా నిర్మించామన్నారు. గత నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బ్రాహ్మణ సంఘం నాయకులు మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ మాట్లాడుతూ గోదావరి తీరంలో అపర కర్మలు నిర్వహించే పురోహితుల కడుపు కొట్టవద్దన్నారు. సానబోయిన రామారావు, అసదుల్లా అహ్మద్, షరీఫ్, కేకే సంజీవరావు, దేశిరెడ్డి బలరామ నాయుడు తదితరులు పలు సూచనలు చేశారు.

2nd pages1.qxd 6/6/2025 7:49 PM Page 7



# ఉపాధ్యాయుడిగా మారిన అనపర్తి ఎమ్మెల్యే



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):-** అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉపాధ్యాయుడిగా మారారు. బ్లాక్ బోర్డుపై పాఠాలు చెప్తూ టీచర్ అవతారం ఎత్తారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించడంలో విద్యార్థులు ముందంజలో ఉండాలని వారికి బోధించారు. మండల కేంద్రమైన పెదపూడిలోని శ్రీ విజ్ఞాన్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పర్యావరణం.. దాని ఆవశ్యకతపై కాసేపు పాఠం బోధించారు. తరగతి గదిలోకి వెళ్లగానే ఆయన టీచర్ గా మారిపోయారు. విద్యార్థులతో ఎమ్మెల్యేగా కాకుండా ఒక పాఠశాల ఉపాధ్యాయుడిగా ప్లాస్టిక్ నివారణ మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణ వంటిశాలను 20 నిమిషాలపాటు చక్కగా వివచారు. పర్యావరణ పరిరక్షణకు ఉపాధ్యాయు విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుండాలని పిలుపు నిచ్చారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెదపూడి మ సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, విద్యాసామాజికకార్యకర్త వీఎస్ఎన్ మాస్టారు, నాయకులు పుట్ట గంగాధర్ చౌదరి, డీసీ చైర్మన్ సాన శ్రీనివాసరావు,జనసేన నాయకులు నాగు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధులపై అవగాహన

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** ఆరోగ్య శాఖలో సుదీర్ఘ కాలం పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధులపై , జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అనేక ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తూ సేవలందిస్తున్న హెల్త్ ఎడ్యుకేటెడ్ గా పనిచేస్తున్న ఉద్యోగులకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హెూదాతో కూడిన పేరు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చేయడం అభినందనీయమని విజయనగరం హెల్త్ ఎడ్యుకేటర్ ఉద్యోగుల సంగం వైస్ ప్రెసిడెంట్ డి.వి గిరిబాబు గారు ట్రెజరర్ ఎం.చాముండేశ్వరి గారు కే. ఎర్రన్న గారు ఆర్. రాం తులసి గారు బి. వి. వి.అప్పారావు గారు అనిల్ ప్రేమ్ కుమార్ గారు ఆర్. ధనలక్ష్మి గారు మర్యాదపూర్వకంగా విజయనగరం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.ఎస్. జీవన్ రాణి గారిని కలిసి క్యాడర్ కు సంబంధించిన ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారు వారికి అభినందనలు తెలియజేశారు అలాగే పలు అంశాలపై చర్చించారు.

# బ్రాండ్ఎక్స్ ఓ బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** బస్సు ప్రమాదంలో గాయాల పాలైన మహిళా కార్మికులను అచ్చుతాపురం ఆసుపత్రిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ .రాము పరామర్శించడం జరిగింది .ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈరోజు ఏ షిఫ్ట్ బ్రాండెఎక్స్ టు విధులకు హాజరవుతున్న దార్లపూడి, ఎటికోప్పాక, పద్మనాభపేట, పులపర్తి, కృష్ణాపురం గ్రామాలకు చెందిన బ్రాండ్ ఎక్స్ మహిళా కార్మికులు బస్సు స్టీరింగ్ లోపం వలన బస్సు కృష్ణాపురం వద్ద తిరగబడిపోయింది దీంట్లో సుమారు 30 మంది మహిళా కార్మికులు గాయాల పాలయ్యారు వీరిని నలుగురిని అనకాపల్లి తరలించగా మిగతా వారిని అచ్యుతాపురం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు వీరిలో తవ్వ. లక్ష్మి ,పార్వతి, మౌనిక ,లక్ష్మి, టి .దుర్గా, సురకట్ల. వెంకటలక్ష్మి, అల్లు.లక్ష్మి తీవ్ర గాయాలు పాలయ్యారు వీటితోపాటు మరి కొంతమందికి గాయాలయ్యాయి వీరికి మెరుగైన వైద్య సేవలు అందించి కోరుకునేంతవరకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, ఇటువంటి ప్రమాదాలు జరగకుండా కండిషన్లో ఉంచి బ్రాండ్ఎక్స్ కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు.

# సహస్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన వంశీకృష్ణ శ్రీనివాస్

### నాణ్యమైన వైద్యసేవలు అందించడంలో పోటీపడాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** శుక్రవారం పెందుర్తిలో సహస్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కార్యక్రమంలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ గారు పాల్గొన్నారు . కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి, హాస్పిటల్ లో పలు విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ మెరుగైన వైద్యసేవలు అందించి, మరింత అభివృద్ధి సాధించి, మరిన్ని బ్రాంచ్లు ఏర్పాట్లు చేసే విధంగా ప్రజలకు చెరువుగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, హాస్పిటల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# చంద్రంపాలెం జాతర గట్టు శ్రీదుర్గాలమ్మ ఆలయంలో విశేష పూజలు

### ఆలయ ప్రాంగణంలో (250) రెండు వందల యాభై మందికి అన్న ప్రసాదం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సరం గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం శుక్ల పక్షం ఏకాదశి శుక్రవారం సందర్భంగా ఉదయం అమ్మవారికి నిత్య అర్చనలతో ప్రారంభమై కుంకుమార్చన, పుష్పార్చన మొదలగు పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ, మూర్తి శర్మ తదితరులు నిర్వహించి కర్పూర హారతి నీరాజన మంత్ర పుష్పం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు, పి.యం.పాలెం నుండి, మధురవాడ ప్రాంతం నుండి భక్తులు సంబరంతో ఆలయానికి ఊరేగింపుగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు సాయంత్రం వేళలో అమ్మవారికి పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి ప్రత్యక పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి కర్పూర హారతి సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు,

అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ఆలయ ప్రాంగణంలో దీపారాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా లక్ష్మివానిపాలెం వాస్తవ్యులు సగురుపిల్లి అప్పలరాజు, శివ కుమార్ , వెంకట భాస్కర్ సోదరులు ఆర్థిక సహాయంతో పులిహెూర ప్రసాదం ఏర్పాటు చేయగా అమ్మవారికి నివేదించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు ప్రతీ శుక్రవారం కనీసం వంద మందికి అన్న ప్రసాదం ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సంకల్పంలో భాగంగా 4వ శుక్రవారం ఈరోజు చంద్రంపాలెం వాస్తవ్యులు పిల్లా వెంకటరమణ, అక్కమ్మల కుమారులు సురేష్ దంపతులు , దుర్గారావు దంపతులు ఆర్థిక సహాయంతో ఆలయంలో (250) రెండు వందల యాభై మంది భక్తులకు, పేదలకు అన్న ప్రసాదం (అన్నసంతర్పణ) నిర్వహించారు ఈరోజు అన్నదాత పిల్లా వెంకట రమణ,శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పిల్లా సూరిబాబు, ఉపాధ్యక్షులు పి.వి.జి.అప్పారావు, సెక్రటరీ నాగోతి తాతారావు, జాయింట్ సెక్రటరీ పిల్లా మోహన్ శివకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బంక వాసు, సభ్యులు పోతిన పైడిరాజు, పిల్లా రమణ , పొట్నూరి హరికృష్ణ, మరుపిల్లి ఆనంద్, కేశనకుర్తి అప్పారావు చంద్రంపాలెం గ్రామ పెద్దలు పీస రామారావు ముఖ్య సభ్యులు పిల్లా పోతరాజు, జగుపిల్లి అప్పారావు, పిల్లా వెంకటరమణ, వాండ్రాసి అప్పారావు, పిల్లా అప్పన్న, యం.వెంకటరావు, పిల్లా రామారావు, సుందర శ్రీను, శంకాబత్తుల శ్రీను, పోతిన రాంబాబు సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# 5వ వార్డు అభివృద్ధికి సహకరించండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** శుక్రవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ మొల్లిహేమలత 5వ వార్డ్ అభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ ఇన్చార్జ్ కమిషనర్ అయిన కలెక్టర్ ఎం.ఎన్.హరేంద్ర ప్రసాద్ కు వినతి పత్రం అందించి వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించి వార్డ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు ముఖ్యమైన సమస్య: శారదానగర్ కాలనీ కొండ ఎగువ ప్రాంతం నుండి రాజీవ్ గృహకల్ప కాలనీ బస్టాప్ కు వెళ్లేందుకు రోడ్డు బొట్టవాని పాలెం,సాయిరాంకాలనీ, మారికవలస రాజీవ్ గృహ కల్ప,బోరవానీపాలెం, పరదేశిపాలెం లలో గల స్మశాన వాటికల అభివృద్ధి పరచాలని నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు అభివృద్ధి పనులు సత్వరమే ప్రారంభించాలని రాజీవ్ గృహకల్ప జే.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. కాలనీలలో యూజీడి సమస్య పరిష్కారానికి గత కౌన్సిల్ సమావేశాల్లో నిధులు మంజూరైన ఇంతవరకు పనులు కాలేదని,వెంటనే పనులు జరిగేటట్లు పరిష్కార మార్గం చూపాలని మారిక వలస గ్రామంలో ఉన్న పార్కు స్థలము ఆక్రమణకు గురి కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని వైయస్సార్ కాలనీ, జే.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. కాలనీలకు స్మశాన వాటిక ఏర్పాటుకు స్థలాలను ఏర్పాటు చేయాలని బొట్ట వానిపాలెం చెరువు సర్వే నెంబర్ 61,నగరంపాలెం సర్వే నెంబర్ 51చెరువులు ఆక్రమణకు గురికాకుండా ప్రజల అవసరాలకు అను గుణంగా అభివృద్ధి పరచాలని మారికవలస నుండి నేషనల్ హైవే వరకు ఉన్న బీటీ రోడ్డు త్వరిత గతిన పునఃనిర్మించ వలసిందిగా కార్పొరేటర్ మొల్లి హేమలత కోరారు మరియు 5వ వార్డులో అధిక జనాభా విస్తీర్ణం దృష్ట్యా చాలా పెద్ద వార్డు అయి నందున పారిశుధ్య కార్మికుల కొరత పట్టిపీడిస్తోంది వార్డు లో చాలాచోట్ల పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా ఉంది ముఖ్యంగా డంపింగ్ యార్డ్ కూడా మా వార్డులో ఉన్నందున మా వార్డులో ఉన్న పారిశుధ్య కార్మికులను అక్కడకి తరలించడం జరుగుతుంది స్థానిక కాలనీల లో పారిశుద్య కార్మికుల కొరత ఉన్నందున ప్రజల అవసరార్థం 5వ వార్డులో క్రొత్తగా ప్రతీ సచివాలయానికి అదనంగా ఇద్దరు చొప్పున పారిశుధ్య కార్మికులను నియమించాలని కావున తమరు మరొకమారు మా అభ్యర్థనను పరిశీలించి త్వరితగతిన పునరుద్ధరణ పనులు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కార్పొ రేటర్ మొల్లిహేమలత కోరారు ఈకార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

# యోగా నిత్యజీవితంలో భాగం కావాలి : కలెక్టర్




**పూసపాటిరేగ,విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** శారీక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతీఒక్కరూ యోగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. ప్రతీవ్యక్తి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా, ప్రముఖ పర్యాటక ప్రాంతం చింతపల్లి సముద్ర తీరంలో శుక్రవారం ఉదయం భారీ యోగా ప్రదర్శన నిర్వహించారు. వందలాదిమంది ఈ కార్యక్రమానికి హాజరు కావడంతో బీచ్ కిటకిటలాడింది.

ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు, శారీక ఆరోగ్యానికి యోగా ఒక దివ్య ఔషదమని పేర్కొన్నారు. యోగావల్ల వివిధ రకాల జీవనశైలి వ్యాధులను దూరం చేసుకోవచ్చునని సూచించారు. యోగా గొప్పదనాన్ని, ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు రాష్ట్రంలో భారీ ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా నుంచి సుమారు 8 లక్షలమందిని భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. దీనికోసం ఇప్పటికే గ్రామస్థాయిలో శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించామని చెప్పారు. పర్యాటక ప్రదేశాల్లో యోగా కార్యక్రమంలో భాగంగా ఇటీవలే రామనారాయణంలో, ఈ రోజు చింతపల్లిలో యోగా ప్రదర్శనలను ఏర్పాటు చేశామన్నారు. త్వరలో తాటిపూడి, రామతీర్థంలో కూడా యోగా పదర్శనలు జరుగుతాయని చెప్పారు. సుమారు 5వేల మంది ఉపాధివేతనదారులతో 10వ తేదీన ఎస్.కోటలో భారీ యోగా ప్రదర్శన నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా ప్రముఖ సైకత శిల్పి హరికృష్ణ రూపొందించిన యోగాంధ్ర సైకత శిల్పం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, పర్యాటకాధికారి కుమారస్వామి, ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, ఎంపిడిఓ రాధిక, తాహసీల్దార్ తాడ్డి గోవింద, గ్రామ సర్పంచి ముసిలి, ఆయుష్ గురు ఇందుమతి బృందం, ఇతర వైద్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, స్థానిక పెద్దలు, వివిధ వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీరు తాగండి.. రక్తపోటు తగ్గించుకోండి

అధిక రక్తపోటును తగ్గించుకోవాలని అనుకుంటున్నారా? అయితే తగినంత నీరు తాగటం అలవాటు చేసుకోండి. రక్తంలో సోడియం మోతాదులు నార్మల్‌లో గరిష్ఠ స్థాయికి దగ్గరలో ఉండటానికీ అధిక రక్తపోటు, గుండె వైఫల్యం ముప్పులు పెరగటానికీ సంబంధం ఉంటున్నట్టు ఇజ్రాయెల్‌లోని బార్-ఇలాన్ యూనివర్సిటీ హెచ్చరిస్తోంది. పరిశోధకులు నాలుగు లక్షలకు పైగా మంది ఆరోగ్య వివరాలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. తగినంత నీరు తాగితే సహజంగానే సోడియం సాంద్రత తగ్గుతుంది. దీన్ని చిన్న విషయంగా భావించటం తగదని, ఇది దీర్ఘకాల గుండెజబ్బుల నివారణకు సమర్థమైన మార్గమని చెబుతున్నారు. రక్తంలో సోడియం మోతాదులు 135-146 ఎంఎంఓఎల్/ఎల్ ఉండటం నార్మల్‌గా భావిస్తారు. ఇవి పైస్థాయికి చేరుకోకముందే ముప్పులు పెరుగుతుండటం గమనించదగ్గ విషయం. సోడియం మోతాదులు 140 నుంచి 146 ఎంఎంఓఎల్/ఎల్ ఉన్నవారికి అధిక రక్తపోటు, గుండె వైఫల్యం తలెత్తే అవకాశం పెరుగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. వయసు, లింగ భేదం, శరీర ఎత్తు బరువు నిష్పత్తి, పొగ తాగే అలవాటు, పొటాషియం మోతాదుల వంటి వాటిని పక్కనపెట్టి చూసినా వీటి మధ్య సంబంధం కనిపిస్తుండటం విశేషం. సోడియం మోతాదులు 143 ఎంఎంఓఎల్/ఎల్ కన్నా మించగానే అధిక రక్తపోటు ముప్పు 29%, గుండె వైఫల్యం ముప్పు 20% పెరుగుతున్నట్టు తేలింది. ఒంట్లో నీటిశాతం తగ్గకుండా



చూసుకోవటం చాలా కీలకమని ఇది తెలియజేస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. దీర్ఘకాల జబ్బుల నివారణకిది తేలికైన, సమర్థ మార్గమని వివరిస్తున్నారు. ఎందుకంటే ఒంట్లో నీటిశాతం తగ్గితే రక్తంలో సోడియం మోతాదులూ పెరుగుతాయి. అందుకే అధిక రక్తపోటు, గుండెజబ్బుల ముప్పును అంచనా వేయటానికి రక్తంలో సోడియం మోతాదులను తెలిపే పరీక్ష చవకైన, తేలికైన మార్గంగానూ ఉపయోగపడగలదని పరిశోధకులు సూచిస్తున్నారు. మగవారు రోజుకు సుమారు 3.7 లీటర్లు, ఆడవారు 2.7 లీటర్ల నీరు తాగాలని ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి. అయితే ఆయా వ్యక్తుల ఆరోగ్యం, చేసే పనులు, వాతావరణాన్ని బట్టి నీటి అవసరం మారుతూ వస్తుంది.

# విశాఖ సమాచారమ్ ఎఫెక్ట్



**అనంతగిరి, (విశాఖ సమాచారమ్):-** గత మే నెల నుంచి జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీలకు చెల్లించవలసిన కూలి సొమ్మును కూలీల వారి ఖాతాలో పేమెంట్లు పడకపోవడంతో తీవ్ర ఆందోళన చెంది గురువారం నాడు దినపత్రిక ముందు వాపోవడంతో ప్రభుత్వం తక్షణమే కూలి సొమ్ము చెల్లించాలని విశాఖ సమాచారమ్ దినపత్రికలో ప్రచురించడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉపాధి కూలీల ఖాతాల్లో రెండు రోజుల్లో వేస్తామని ప్రకటించింది . దాంతో కూలిలు అంతా సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# తపాలా అదాలత్ నిర్వహణ

**విజయవాడ, (విశాఖ సమాచారమ్):-** విజయవాడ పోస్టల్ రీజియన్ సరిధిలోని తపాలా సేవలకు సంబంధించి వినియోగదారుల యొక్క ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించు నిమిత్తము తేది 17.06.2025, 12.00 మధ్యాహ్నం శ్రీ డి.యస్.ఐ.ఆర్. మూర్తి పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ రీజియన్, విజయవాడ వారిచే తపాలా అదాలత్ నిర్వహించబడును. తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులు మరియు సమస్యలు ఈ అదాలత్ నందు పరిష్కరించబడును. తపాలా వినియోగదారులు తమ సమస్యలు మరియు ఫిర్యాదులు తేది 16-06-2025 లోగా "తపాలా అదాలత్" శీర్షికతో అసిస్టెంట్ డైరక్టర్ (స్టాఫ్), పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, గాంధీనగర్, విజయవాడ-520003 అను చిరునామాకు పంపవలసినదిగా కోరడమైనది. పిర్యాదు దారులు వ్యక్తిగతంగా కూడా హాజరు కావొచ్చునని పోస్ట్ మాస్టర్ జనరల్ వారు తెలిపారు.

# పకడ్బందీగా డిఎస్‌సి పరీక్షలు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ - పరీక్షా కేంద్రం తనిఖీ



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** డిఎస్సి పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నుంచీ డిఎస్సి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో, స్థానిక అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులకు అక్కడ కల్పించిన వసతులను, పరీక్ష నిర్వహణను, బందోబస్తును పరిశీలించారు. అభ్యర్థులకు ఏమాత్రం ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను కల్పించాలని ఆదేశించారు. అప్రమత్తంగా ఉండి, అవసరమైన వారికి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని వైద్య శిబిరం సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట డిఈఓ యు. మాణిక్యంనాయుడు, ఇన్‌ఛార్జి తాహసీల్దార్ స్వర్ణకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# 20న తపాలా అదాలత్

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని వినియోగదారుల వ్యక్తిగత, సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 20న 118వ తపాలా అదాలత్ నిర్వహిస్తామని విశాఖపట్నం రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం ఎంవిపి కాలనీలోని పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈ అదాలత్ జరుగుతుందని తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులను మాత్రమే ఈ అదాలత్‌లో చర్చించడం జరుగుతుందని తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు ఈ అదాలత్‌కు హాజరు కావచ్చునని తెలిపారు. అదాలత్ కు హాజరయ్యేవారు తమ సమస్యలను ఈ నెల 16లోగా 118వ తపాలా అదాలత్ అన్న శీర్షికతో, విశాఖపట్నం ఎంవిపి కాలనీలోని తమ కార్యాలయానికి ధరఖాస్తు పంపించాలని ఆయన సూచించారు. గడువు దాటిన తరువాత వచ్చే ధరఖాస్తులు స్వీకరించడం జరగదని ఆయన స్పష్టం చేశారు.

# చెరువులా ఆర్టీసీ కాంప్లెక్స్



**శ్రీకాకుళం, (విశాఖ సమాచారమ్):-** చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు.. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ చెరవును తలపిస్తుంది. ఈ నీరు వెళ్లేవరకు ప్రయాణికుల ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. గురువారం వర్షం బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం వరకు విరగ కాచిన ఎండతో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. సాయంత్రం 3.30 గంటల నుంచి వర్షం కురిసింది. ఆపై పిడుగుల మోత.. ఈదురుగాలులు మొదలయ్యాయి. నగరంలో ఆర్ట్స్ కళాశాల మైదానం, కేఆర్ స్టేడియంలో నీరు చేరిపోయింది. ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయమైంది. సమీపంలోని మురుగు కాలువల్లోని నీరు కూడా చేరిపోయింది. దివ్యాంగులు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందలు పడ్డారు. నీటిలోనే బస్సులు ఎక్కాల్సి వచ్చింది. ఇక ద్విచక్రవాహనదారులు అవస్థలు అన్నీ ఇన్నీకావు.

2nd pages1.qxd 6/6/2025 7:49 PM Page 8



# క్రీడా సమాచారమ్

## కరుణ్‌నాయర్ అనుభవం టీమ్ఇండియాకు ఉపయోగం

### -గౌతమ్ గంభీర్



**ఇంటర్నెట్ డెస్క్:** దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించి, చాలా సంవత్సరాల తర్వాత టీమ్ఇండియాలోకి పునరాగమనం చేసిన కరుణ్ నాయర్‌ను ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రశంసించాడు. ఇంగ్లండ్ టూర్‌లో కరుణ్ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని విశ్వాసం వ్యక్తంచేశాడు. భారత్, ఇంగ్లండ్ టూర్‌కు బయలుదేరనున్న నేపథ్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో గౌతమ్ గంభీర్ మాట్లాడారు. కరుణ్ నాయర్ ఇంతకుముందు చివరిసారిగా 2017లో టీమ్ఇండియా తరఫున అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ ఆడాడు. దేశవాళీల్లో రాణించడంతో అతన్ని ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనకు సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇందులోభాగంగా ఇటీవల ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన అనధికారిక మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఈ సీనియర్ బ్యాటర్ డబుల్ సెంచరీ సాధించాడు.

**'తలుపులు తెరిచే ఉంటాయి'**

'కరుణ్ నాయర్ అనుభవం టీమ్ఇండియాకు ఎంతో మేలు చేస్తుంది. అతడు ఇంతకుముందు ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడాడు. అక్కడి పరిస్థితుల మీద కరుణ్‌కు అవగాహన ఉంది. అందుకే ఈ టూర్‌లో అతడు కీలకం కానున్నాడు. నేను యువ క్రికెటర్లకు ఒకటే చెబుతున్నా.. మీరు మీ అత్యున్నత ప్రదర్శన ఇస్తున్నన్ని రోజులు మీకోసం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. మేం కేవలం ఒకటి, రెండు టెస్టు మ్యాచ్‌ల్లో ప్రదర్శన చూసి వారి మీద ఓ అభిప్రాయానికి రాము. నిలకడగా పరుగులు సాధిస్తేనే, అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించగలరు' అని గౌతమ్ గంభీర్ అన్నాడు.

**దేశవాళీల్లో కరుణ్ ప్రదర్శన ఇదీ..**

రంజీ ట్రోఫీలో విదర్భ తరఫున కరుణ్‌నాయర్ ఈ సీజన్‌లో దుమ్ము రేపాడు. 53.93 యావరేజ్‌తో తొమ్మిది మ్యాచుల్లో 16 ఇన్నింగ్స్‌ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలున్నాయి. ఫైనల్‌లో 135 పరుగులు చేసి, జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

విజయ్ హజారే ట్రోఫీలోనూ కరుణ్ నాయర్ మెరుగైన ప్రదర్శన చేశాడు. తొమ్మిది మ్యాచ్‌లు, ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 389.50 యావరేజ్, 124.04 స్ట్రైక్‌రేట్‌తో 779 పరుగులు చేశాడు. ఇందులో అయిదు శతకాలు, ఒక అర్ధ శతకం ఉంది. 163లి అత్యధిక స్కోరు.

అలాగే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (టీ20)లో 42.50 యావరేజ్, 177.08 స్ట్రైక్ రేట్‌తో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు. ఇందులో మూడు అర్ధ శతకాలున్నాయి. 77లి అత్యధిక స్కోరు.

ఈ ప్రదర్శనల ఆధారంగానే దాదాపు ఎనిమిదేళ్ల విరామం తర్వాత కరుణ్ నాయర్ తిరిగి భారత టెస్టు జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. దీన్ని సుస్థిరం చేసుకోవడమే ప్రస్తుతం అతడి ముందున్న కర్తవ్యం!

## విజయోత్సవాల కోసం రెండు రోజులు ఆగలేకపోయారా?

### - మనోజ్ తివారీ



**ఇంటర్నెట్ డెస్క్:** ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా తొక్కిసలాట జరిగి బుధవారం 11 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మాజీ క్రికెటర్, ప్రస్తుత టీఎంసీ ఎమ్మెల్యే మనోజ్ తివారీ ఈవిషయమై మాట్లాడాడు. ఇది పూర్తిగా నిర్వాహకుల తప్పిదమే అన్నాడు. పెద్దసంఖ్యలో జనం గుమిగూడితే ఎదురయ్యే ఇబ్బందుల గురించి ఆలోచించకుండానే హడావుడిగా కార్యక్రమాన్ని నిర్వహించారని అతడు విమర్శించాడు. 'ఈ విజయోత్సవాలను ఎందుకు ఒకటి, రెండు రోజుల తర్వాత నిర్వహించలేదు? అప్పుడు సరిగా నిర్వహించడానికి సమయం ఉంటుంది కదా! అభిమానుల సంఖ్యను, భావోద్వేగాన్ని ముందుగానే అంచనా వేయాలి. వేడుకల కంటే మనిషి ప్రాణానికే విలువ ఎక్కువ. అది కేవలం పొరపాటు కాదు. ఘోరమైన తప్పిదం. దీనికి అందరూ ఉమ్మడిగా బాధ్యతగా వహించాలి' అని మనోజ్ తివారీ అన్నాడు.

అలాగే 2012లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఐపీఎల్ టైటిల్ గెలిచినప్పుడు జరిగిన విజయోత్సవాల గురించి ఈసందర్భంగా గుర్తు చేసుకున్నాడు. 'అప్పుడు మా ముఖ్యమంత్రి ఏ మాత్రం తొందరపడకుండా, ఓ రెండు రోజులు ఆగిన తర్వాత వేడుకలు నిర్వహించారు. అలాంటి ముందు చూపున్న నాయకత్వమే విషాదాలు జరగకుండా నిరోధించగలుగుతుంది. నేను ఇక్కడ అలాంటి ప్రణాళిక ఏదీ చూడలేదు. చిన్నస్వామి స్టేడియం లోపల ఆర్సీబీ వేడుకలు జరుగుతుంటే... వెలుపల జనాలు ప్రాణాలు కోల్పోయారు' అని మనోజ్ తివారీ ఆవేదన వ్యక్తంచేశాడు.

## పెళ్లి చేసుకున్న అఖిల్.. అమ్మాయి బ్యాక్ గ్రౌండ్ ఏంటంటే?



అక్కినేని నాగార్జున చిన్న కొడుకు అఖిల్ పెళ్లి చేసుకున్నాడు. శుక్రవారం వేకువజామున 3 గంటలకు జైనబ్ రవ్జీతో ఒక్కటయ్యాడు. హిందూ సంప్రదాయం ప్రకారం ఈ వివాహం జరగ్గా.. కుటుంబ సభ్యులు, అతికొద్ది మంది సన్నిహితులు మాత్రమే ఈ శుభకార్యానికి హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అఖిల్.. గతేడాది నవంబరులో జైనబ్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఇది జరిగేంతవరకు ఎవరికీ తెలియనంత సీక్రెట్‌గా ఉంటారు. ఎంగేజ్‌మెంట్ జరిగిన ఆరు నెలలకు ఇప్పుడు సంప్రదాయ బద్ధంగా పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలోనే అఖిల్ భార్య జైనబ్ గురించి తెగ సెర్చ్ చేస్తున్నారు. ఇంతకీ జైనబ్ ఎవరు? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి?

అఖిల్ భార్య జైనబ్ రవ్జీ.. ముంబైకి చెందిన పెయింటింగ్ ఆర్టిస్ట్. ఇదివరకే హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, లండన్, దుబాయిలలో ఎగ్జిబిషన్స్ పెట్టింది. ఈమె సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ కూడా. ముంబైకి చెందిన బిజినెస్‌మ్యాన్ జుల్ఫీ రవ్జీ కూతురే జైనబ్. ఈమెకు జైన్ రవ్జీ అనే సోదరుడు కూడా ఉన్నాడు. అతడు జేఆర్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నాడు.

జైనబ్ తండ్రి, నాగార్జున స్నేహితులు. అలా వీరిమధ్య ఉన్న స్నేహం కారణంగా కుటుంబాల మధ్య కూడా స్నేహం కుదిరింది. అలా అఖిల్-జైనబ్ ఒకరికొకరు పరిచయం. అలా కొన్నాళ్ల తర్వాత వీళ్లిద్దరూ ప్రేమలో పడ్డారు. గతేడాది పెద్దల్ని ఒప్పించి నిశ్చితార్థం చేసుకున్నారు. ఇప్పుడు పెళ్లితో కొత్త జీవితాన్ని ప్రారంభించారు. అయితే అఖిల్ కంటే జైనబ్ ఎనిమిదేళ్ల పెద్ద. అఖిల్ ప్రస్తుత వయసు 31 ఏళ్లు కాగా.. జైనబ్ వయసు 39 అని తెలుస్తోంది. జైనబ్ కూడా గతంలో 'మీనాక్షి ఏ టేల్ ఆఫ్ త్రీ సిటీస్' అనే హిందీ సినిమాలో నటించిందని తెలుస్తోంది.

**హాజరైన చిరంజీవి ఫ్యామిలీ**

హీరో నాగార్జున చిన్న కుమారుడు అక్కినేని అఖిల్) బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్తూ వైవాహిక జీవితానికి వెల్‌కమ్ చెప్పాడు. ప్రియురాలు జైనబ్‌ను వేదమంత్రాల సాక్షిగా పెళ్లాడాడు. జూబ్లీహిల్స్‌లో నాగార్జున నివాసంలో శుక్రవారం (జూన్ 6న) ఉదయం మూడు గంటలకు ఈ వివాహం జరిగింది. ఇరుకుటుంబ సభ్యులు సహా అతి దగ్గరివాళ్లే ఈ వెడ్డింగ్‌కు హాజరయ్యారు.

**సెలబ్రిటీల హాజరు**

మెగాస్టార్ చిరంజీవి- సురేఖ, రామ్‌చరణ్- ఉపాసన దంపతులు, దర్శకుడు ప్రశాంత్ నీల్, హీరో సుమంత్ సహా తదితరులు పెళ్లికి హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. పెళ్లి అనంతరం జరిగిన బరాత్‌లో హీరో నాగచైతన్య హుషారుగా పాల్గొన్నాడు. జూన్ 8న అన్నపూర్ణ స్టూడియోలో ఘనంగా రిసెప్షన్ జరగనుంది. అంగరంగ వైభవంగా జరగనున్న ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు.

**అఖిల్ ఎంగేజ్‌మెంట్**

అఖిల్- జైనబ్‌ల నిశ్చితార్థం గతేడాది నవంబర్‌లో జరిగింది. సరిగ్గా అదే సమయంలో నాగచైతన్య - శోభితల పెళ్లి పనులు మొదలుకావడంతో అఖిల్ పెళ్లిని వాయిదా వేశారు. చై-శోభిత గతేడాది డిసెంబర్‌లో పెళ్లి చేసుకున్నారు. ఇక హైదరాబాద్‌లో పుట్టిన జైనబ్ రవ్జీ ఒక ఆర్టిస్ట్. రిఫ్లెక్షన్ పేరుతో హైదరాబాద్‌లో ఓ పెయింట్ ఎగ్జిబిషన్ నిర్వహించగా అందులో ఈమె వేసిన పెయింటింగ్స్‌ను ప్రదర్శించారట! మీనాక్షి: ఎ టేల్ ఆఫ్ త్రీ సిటీస్ సినిమాలోనూ ఓ చిన్న పాత్రలో నటించిందట! ఈమె తండ్రి జుల్ఫీ రవ్జీ నిర్మాణ రంగంలోనే పెద్ద బిజినెస్ టైకూన్ అని తెలుస్తోంది.

**గతంలో పెళ్లి క్యాన్సిల్**

మరి అఖిల్- జైనబ్‌లు పెయింటింగ్ ఎగ్జిబిషన్‌లోనే ఒకరికొకరు పరిచయమయ్యారా? అసలు వీరి ప్రేమకథ ఎలా మొదలైందన్నది ఇప్పటికీ సస్పెన్స్‌గానే ఉంది. ఇదిలా ఉంటే అఖిల్ గతంలో.. పారిశ్రామికవేత్త జీవీకే రెడ్డి మనవరాలు శ్రేయ భూపాల్‌తో ప్రేమలో పడ్డాడు. 2016లో వీరి ఎంగేజ్‌మెంట్ కూడా జరిగింది. పెళ్లితో ఒక్కటి కాబోతారనుకునేలోపే వివాహం రద్దు చేసుకుని అందరికీ షాకిచ్చారు. ప్రస్తుతం అఖిల్ 'లెనిన్' అనే సినిమా చేస్తున్నాడు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందించిన గంటా...!



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):-** భీమిలి జోన్ 3వ డివిజన్ ఎగువపేట గ్రామం మత్స్యకారుల కుటుంబానికి చెందిన వాసుపల్లి ఆకాశం, శాంతిల కుమారుడు వాసుపల్లి అభినయ్ కి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన 60,000 రూపాయలు చెక్కును భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా అందించడం జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలియజేసారు. వాసుపల్లి అభినయ్ కి ఆరోగ్యం సరిగా లేక విశాఖలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారని అన్నారు. అప్పుచేసి బాబును బ్రతికించుకోవాలనే తపనతో తల్లిదండ్రులు ఎంతో ఆవేదన చెందారని అన్నారు. పేద కుటుంబంలో పుట్టి పెరిగిన వీరికి ఇలాంటి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఇంకా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తాయని అన్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సిఎమ్ సహాయనిధి ద్వారా పేదల ఆసుపత్రి ఖర్చులు భరించడం కోసం నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అన్నారు. పేద కుటుంబాల్లో నూతన వెలుగులు నింపేందుకు ఈ సిఎమ్ సహాయనిధి తోడ్పాటునిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మా ప్రియతమ నాయకులు, శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయడం అది తక్షణమే అమలు అయ్యేవిధంగా చేయడం శుభపరిణామమని అన్నారు. వీరి కుటుంబానికి ఆపన్నహస్తం అందించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మరియు నారా లోకేష్ బాబుకి హృదయపూర్వక ధన్యవాదములు అని గంటా నూకరాజు అన్నారు.

## 2025-26 ఆర్థిక సంవత్సరానికి 13,444 కోట్ల రూపాయలతో వార్షిక రుణ ప్రణాళిక

### రుణాల మంజూరు లో శత శాతం లక్ష్యాలను చేరాలి: జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** 2025-26 ఆర్థిక సంవత్సరానికి 13,444 కోట్ల రూపాయలతో వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ విడుదల చేసారు. గత ఏడాది కన్నా 19.20 శాతం అదనంగా ఈ ఏడాది పెంచడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది రుణ ప్రణాళికలో వ్యవసాయానికి 8,025 కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎం.ఎస్.ఎం.ఈ క్రింద ముద్ర, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా రుణాల కోసం 1,843 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. విద్య, గృహ నిర్మాణ రంగాలకు 282 కోట్లను కేటాయించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు లక్ష్యాలకు తగ్గట్టుగా శత శాతం రుణాలను అందజేయడానికి ముందుకు రావాలని తెలిపారు. ఈ ఏడాది 140 కోట్ల రూపాయలను పంట రుణాలుగా అందించాలనే లక్ష్యం తో పని చేస్తున్నామని తెలిపారు. ఈ ఖరీఫ్ లో వరి సాగును పెంచడానికి చర్యలు తీసుకున్నామని, ముందే వర్షాలు పడడం తో ప్రస్తుతం జిల్లాలో వర్షపాతం అధికంగా నమోదైందని, పంటకు రైతులను ముందుగానే సిద్ధం చేయాలని తెలిపారు. నవంబర్ నెలలో తుఫాన్లు వచ్చే అవకాశం ఎక్కువని, అక్టోబర్ నాటికే వరి పంట కోతలయ్యేలా ప్రణాళికలు వేసుకోవాలని తెలిపారు. అందుకోసం బ్యాంకర్లు జూలై లోపలే రుణాలు మంజూరు చెయ్యాల్సి ఉంటుందని అన్నారు. సిసిఆర్సి కార్డులను వెంటనే బ్యాంక్ లకు పంపాలని జిల్లా వ్యవసాయ అధికారికి ఆదేశించారు.

పి.ఎం.విశ్వకర్మ క్రింద అందిన దరఖాస్తులకు వేగంగా రుణాలు అందేలా చూడాలన్నారు. ఈ పథకం క్రింద ఇంతవరకు 86,386 దరఖాస్తులు అందగా స్టేజి 3 వెరిఫికేషన్ అనంతరం 6182 దరఖాస్తులను ఆమోదించినట్లు తెలిపారు. వీరిలో 5057 మందికి బేసిక్ స్కిల్ ట్రైనింగ్ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. బాంక్ లకు 3805 దరఖాస్తులను పంపగా 1080 మందికి 6.86 కోట్ల రూపాయలు రుణాలు మంజూరయ్యాయని, మిగిలిన వారికి రుణాలను వేగంగా అందేలా చూడాలని తెలిపారు.

పి.ఎం.సూర్యఘర్, ముద్ర రుణాలు, స్టాండ్ అప్ ఇండియా, మెప్మా, డి.ఆర్.డి.ఏ, మైనారిటీ కార్పొరేషన్, తదితర సంస్థల ద్వారా లబ్ధిదారులకు రుణాలు అందజేయాలని, ఇప్పటికే రుణాలు అందుకున్న వారు ఎటువంటి యూనిట్ల ను స్థాపించారో క్షేత్ర స్థాయి లో పరిశీలించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎల్.డి.ఎం రమణ మూర్తి, నాబార్డ్ డీడీఎం నాగార్జున, జిల్లా అధికారులు, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమంగా స్క్రాప్ తరలింపుపై విజిలెన్స్ దాడులు




**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** ప్రాంతీయ నిఘా మరియు అమలు అధికారి బి. ప్రసాదరావు వారి ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులకు సరైన జీఎస్టీ బిల్లులు లేకుండా స్క్రాప్ ను అక్రమంగా రవాణా చేయుచున్నరని వచ్చిన సమాచారంపై విజయనగరం జిల్లా భోగాపురం మండలం, నాతవలస టోల్ గేట్ దగ్గర విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించుచుండగా, టి.ఎస్. 07 యుజి 1836 అను నెంబర్ గల వాహనం స్క్రాప్ లోడ్ తో రావడం గమనించి సదరు వాహనం ను ఆపి తనిఖీ చేయగా, ఆ వాహనం స్క్రాప్ లోడ్ ను ఇచ్చాపురం నందు లోడ్ చేసి హైదరాబాద్ నకు తీసుకు వెళుతున్నట్లు దానికి సంబందించిన ఇ వే బిల్లు, టాక్స్ ఇన్వాయిస్ లను పరిశీలించి, అనుమానంతో జీఎస్టీ అధికారులకు తగు చర్య నిమిత్తం అప్పగించడం అయినది. ఇదే క్రమంలో 31-05-2025 తేదీ నాడు నిర్వహించిన వాహన తనిఖీల లో పలాస నుండి హైదరాబాద్ నకు రవాణా చేస్తూ పట్టుబడిన స్క్రాప్ లారీ ఏపీ37టిటి3599 నెంబర్ గల వాటికి సరైన ఇ వే బిల్లు, టాక్స్ ఇన్వాయిస్ లేకపోవడం వల్ల జీఎస్టీ అధికారులు వారిపై 1,88,440/- రూపాయలు అపరాద రుసుము ను స్క్రాప్ ఓనర్ నుండి వసూలు చేయడం జరిగినది. పై తనిఖీలలో విజిలెన్స్ అధికారులు సిఐ లు సింహాచలం, రవి ప్రసాద్, సతీష్ కుమార్ వారి సిబ్బంది మరియు జీఎస్టీ అధికారులు ఉమా శంకర్ వారి సిబ్బంది పాల్గొన్నారు..

## విశాఖ రైల్వే జోన్‌పై ప్రత్యేక శ్రద్ధకు కృతజ్ఞతలు

### మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**అమరావతి, (విశాఖ సమాచారమ్):-** విశాఖ సౌత్ రైల్వే జోన్ కి జిఎంను నియమించిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విశాఖ జిల్లా ఇన్ చార్జ్ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నాడు విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.... ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల విశాఖ రైల్వే జోన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్ర రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు. విశాఖ సౌత్ కోస్ట్ రైల్వే జోన్ జిఎంగా నియమితులైన సందీప్ మధుకు అభినందనలు. ఆయన బాధ్యతలు బాధ్యయుతంగా నిర్వర్తించి రైల్వేజోన్ అభివృద్ధి కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నా. విశాఖ రైల్వే జోన్ వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు. రాష్ట్రాభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంతో రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## కనకదుర్గ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



**కాకినాడ రూరల్ (విశాఖ సమాచారమ్):** కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో ఉన్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి యంత్ర స్థాపన, శంకుస్థాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తుల కోరికలను తీర్చి భక్తుల పాలిట కొంగు బంగారం గా 25 సంవత్సరముల నుండి పూజలందుకుంటున్న శ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు సహకారంతో భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఉదయం ఆలయ పురోహితులు బ్రహ్మశ్రీ కొండబాబు చే యంత్ర స్థాపన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com